ఐదేళ్ల తర్వాత స్వేచ్ఛా వాయువులు!



● వైసీపీ పాలనలో ఆంక్షలు, అణచివేతలతో అన్ని వర్గాల ప్రజలూ సతమతం

తిరుపతి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నేటి స్వాతంత్ర దినోత్సవ సంబరాలు జిల్లా ప్రజలకు మాత్రం ప్రత్యేకమైనవనే చెప్పాలి. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ళ పాటు అడుగడుగునా ఆంక్షలు, అణచివేతలతో జిల్లా ప్రజలు విసిగిపోయారు. ప్రతిపక్ష రాజకీయ పార్టీల శ్రేణులకు గడచిన ఐదేళ్ళ కాలం పీడకలగా పరిణమించింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నోరెత్తనివ్వలేదు. కనీసం తమ న్యాయమైన కోరికలు నెరవేర్చాలని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు గట్టిగా డిమాండ్ వినిపించలేని దుస్థితి నెలకొంది.ఛలో విజయవాడకు బయల్దేరిన అంగన్‌వాడీ వర్కర్లను మార్గమధ్యంలో అర్ధరాత్రి నిర్జన ప్రాంతాల్లో బస్సుల్లోంచి దింపేసిన అమానవీయ ఘటనలు జరిగాయి. విపక్ష శ్రేణులు మొదలుకుని వామపక్షాల వరకూ అందరి గొంతులూ మూగబోయాయి. స్థానిక ఎన్నికల్లో విపక్ష అభ్యర్థులు నామినేషన్లు కూడా దాఖలు చేయలేని దురవస్థ అలుముకుంది. వైసీపీ నేతలు, కార్యకర్తలు వారి నుంచీ నామినేషన్ పత్రాలు గుంజుకుని చింపేసిన సందర్భాలు, దాడులు జరిపి తరిమివేసిన ఘటనలూ అనేకం. చివరికి అధికార పార్టీకి చెందిన రెబల్ అభ్యర్థులకు సైతం ఇదే చేదు అనుభవం ఎదురైంది.చివరికి ఆయన మరో విమానంలో హైదరాబాదు వెనుదిరగాల్సి వచ్చింది. బలమైన రాజకీయ పక్షమైన టీడీపీ యువనేత నారా లోకేశ్ యువగళం వినిపించేందుకు రోడ్డెక్కడానికి సైతం ఆంక్షలు ఎదురయ్యాయి. కార్యకర్తలు మొదలు జిల్లా నేతలు సైతం హౌస్ అరెస్టుల పేరిట నిర్బంధాలు ఎదుర్కొన్నారు.నారా లోకేశ్‌పై సైతం పలు కేసులు పెట్టారు. ఆయన కనీసం స్టూలుపై కూడా నిల్చోకుండా ఆంక్షలు విధించారు.రాష్ట్రానికి 14 ఏళ్ళ పాటు సీఎంగా పనిచేసిన టీడీపీ అధినేత చంద్రబాబు 2021 మార్చి 1న తిరుపతి విమానాశ్రయం దాటి వెలుపలికి రాకుండా ఒక రోజంతా పోలీసు ఆంక్షలకు గురయ్యారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో టీడీపీ కార్యకర్తలు, నాయకులపై వైసీపీ దాడులు దౌర్జన్యాలపై చిత్తూరు కలెక్టర్, ఎస్పీలను కలిసేందుకు విమానంలో తిరుపతి వచ్చిన ఆయనను పోలీసులు వెలుపలికి రానివ్వలేదు.అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైసీపీ నేతలు దాడులు, దౌర్జన్యాలు, కబ్జాలతో చెలరేగిన వైనం సామాన్య జనానికి నిదుర లేని రాత్రుల్ని మిగిల్చింది. తిరుపతి నగరంలో ఇంటి స్థలాలను, భూములను కాపాడుకోవడం యజమానులకు అలవికాని పనిగా మారింది. ఏ రాత్రి ఎవరొచ్చి స్థలాలు ఆక్రమించి కంచె వేస్తారో, రూములు కట్టేస్తారోనని నిద్రలేని రాత్రులు గడపాల్సి వచ్చింది. ఎంతోమంది రూ. కోట్ల విలువైన స్థలాలు కోల్పోయారు కూడా. రెవిన్యూ, పోలీసు విభాగాల్లో ఎవరిని ఆశ్రయించినా న్యాయం జరిగిన దాఖలాల్లేవు. చివరికి విదేశాల్లో ఉద్యోగాలు చేసుకునే ప్రవాసులు సైతం అక్కడి నుంచే వీడియోల ద్వారా తమ ఆవేదన వెళ్ళగక్కిన ఉదంతాలూ అనేకం వున్నాయి. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ళ దహనం ఘటన తర్వాత తమ భూములు కబ్జా అయ్యాయని, బలవంతంగా గుంజుకున్నారని ఆరోపిస్తూ బాధితులు వేల సంఖ్యలో క్యూ కడుతుండడమే దీనికి నిదర్శనం.ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలతో ప్రభుత్వం మారడంతో అన్ని వర్గాల ప్రజానీకం ఊపిరి పీల్చుకున్నారు.గత ఐదేళ్ళుగా దూరమైన స్వేచ్ఛను తిరిగి పొందుతున్నట్టు ప్రజలు భావిస్తున్నారంటే అతిశయోక్తి కాదు.అందుకే నేటి స్వాతంత్ర దినోత్సవం జిల్లా ప్రజల పాలిట నిజంగా సంబరం.

పడవలో జెండాల సందడి

స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకొని తడ మండలంలోని ఇరకందీవి విద్యార్థులు పులికాట్ సరస్సులో పడవపై పాఠశాలలకు వెళ్తూ జాతీయ జెండాలను చేతబూని సందడి చేశారు.భారత్‌మాతాకూ జై అంటూ నినాదాలు చేశారు.

- తడ

133 అడుగుల పతాకం



తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని కేవీఎస్ స్పోర్ట్స్ పార్క్‌లో 133అడుగుల ఎత్తులో వుడెన్‌పోల్‌పై ఎగురుతున్న అతి పెద్ద మువ్వన్నెల జాతీయజెండా చూపరులను ఆకట్టుకుంటోంది. బర్మా టేకుతో వుడెన్‌పోల్‌పై చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ త్రివర్ణపతాకాన్ని 20అడుగుల ఎత్తు..30అడుగల వెడల్పుతో స్తంభానికి జోడించి వుంచారు. ప్రముఖ ఆర్కిటెక్చర్ల పర్యవేక్షణలో 5నెలలపాటు 50మంది కార్మికులు శ్రమించి తయారు చేసిన ఈ జెండాకు బుధవారం గౌరవ వందనం సమర్పించనున్నారు. ఇప్పటివరకు ఢిల్లీలోని రాష్ట్రపతిభవన్‌లో మాత్రమే 120అడుగుల ఎత్తులో జాతీయజెండా కనబడుతుండగా.. ఇప్పుడు తిరుపతిలో 133అడుగుల ఎత్తులో జాతీయజెండా కనిపిస్తుండడం విశేషం. - తిరుపతి రూరల్



స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో జాతీయ నాయకుల సైకత-శిల్పాలను రూపొందించిన సనత్‌కుమార్ -గూడూరు

సీఐ దాసరి గంగరాజుకు రాష్ట్రపతి అవార్డు



తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 14:వెంకటగిరి ఏపీఎస్పీ బెటాలియన్‌లో రిజర్వు సీఐగా పనిచేస్తున్న దాసరి గంగరాజు రాష్ట్రపతి అవార్డుకు ఎంపికయ్యారు.స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ఈ ఏడాది విజయవాడలో ఐజీగా పనిచేస్తున్న రవిప్రకాష్,గంగరాజులను మాత్రమే ప్రభుత్వం ఎంపిక చేసింది.తూర్పు గోదావరి జిల్లా పెద్దబ్రహ్మదేవం గ్రామానికి చెందిన గంగరాజు 1998లో రిజర్వు ఎస్ఐగా పోలీసు శాఖలో చేరారు. ఏపీ పోలీసు అకాడమీలో పనిచేశాక టీటీడీకి బదిలీపై వచ్చి ఐదేళ్ళ పాటు ఏవీఎస్వోగా పనిచేశారు.ఇటీవల జరిగిన బదిలీల్లో వెంకటగిరి ఏపీఎస్పీ బెటాలియన్‌కు బదిలీ అయ్యారు.అవార్డు ప్రకటించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014లో ఇండియన్ పోలీసు మెడల్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబునుంచి అందుకున్నానని చెప్పారు.రాష్ట్రపతి అవార్డు రావడం పట్ల చాలా సంతోషంగా వుందని చెప్పారు.

పోలీసు మైదానంలో రిహార్సల్స్



పోలీసు కవాతు రిహార్సల్స్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 14: తిరుపతిలో గురువారం జరగనున్న స్వాతంత్ర దిన వేడుకలకు జిల్లా పోలీసు పెరేడ్ మైదానం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది.బుధవారం పోలీసు కవాతు రిహార్సల్స్‌ను కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు పర్యవేక్షించారు. జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం చేశారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, కమిషనర్ మౌర్య, అదనపు ఎస్పీలు పాల్గొన్నారు.

6 శకటాలు, 66 స్టాళ్లు

తిరుపతి(విద్య), ఆగస్టు 14: తిరుపతి పోలీస్ పరేడ్ మైదానంలో నేడు జరగనున్న స్వాతంత్ర్య దిన వేడుకల్లో ఆరు శకటాలు పాల్గొంటాయి.పరిశ్రమల శాఖ, వ్యవసాయ, విద్య, డీఆర్‌డీఏ, పోలీస్, తిరుపతి మున్సిపాలిటీలకు సంబంధించిన శకటాలను ఆయా శాఖలు సిద్ధం చేశాయి. ఆయా శాఖల్లో సాధించిన ప్రగతిని వివరించేలా రూపొందించిన శకటాలు ప్రదర్శనలో సభికుల ముందుకు రానున్నాయి. అలాగే పోలీసు శాఖ కూడా ఓ స్టాల్‌ను ఏర్పాటు చేయనుంది. డీఆర్‌డీఏ 2, మహిళా, శిశు సంక్షేమశాఖ 3, పీడీ, మెప్మా శాఖలు 4, వ్యవసాయ శాఖ 5, హార్టికల్చర్ 6, సెరికల్చర్ 7, వైద్య శాఖ 8, టూరిజం 9, అటవీశాఖ 10, యానిమల్ హస్బెండరీ శాఖ 11 స్టాళ్లు ఏర్పాటు చేశాయి.

షార్‌లో ఉత్సవాలకు ఇస్రో చైర్మన్

సూళ్లూరుపేట, ఆగస్టు 14:శ్రీహరికోటలోని అంతరిక్ష కేంద్రీయ పాఠశాల మైదానంలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవాలకు ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ హాజరు కానున్నట్లు అధికారులు తెలిపారు. జాతీయ పతాకాన్ని ఆయన ఎగురవేయనున్నారు.శుక్రవారం షార్ వేదికగా ప్రయోగించే ఎస్ఎస్ఎల్వీ-డీ 3 రాకెట్ ప్రయోగ ఏర్పాట్లలో శాస్త్రవేత్తలతో కలిసి పాలుపంచుకోనున్నారు.

● టీడీఆర్ ఎఫెక్ట్

తిరుపతి మాజీ కమిషనర్ హరితపై వేటు



● అనంతపురం జేసీ నియామకం రద్దు
● జీఏడీకి రిపోర్ట్ చేయాలని ఆదేశం

తిరుపతి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో తిరుపతి కార్పొరేషన్లో జరిగిన టీడీఆర్ బాండ్ల కుంభకోణంలో బాధ్యులపై చర్యలు మొదలయ్యాయా? తిరుపతి కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేసిన ఐఏఎస్ అధికారి డి. హరితకు అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఇచ్చిన నియామకాన్ని రద్దు చేస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా ఉన్న బాలసుబ్రమణ్యాన్ని మంగళవారం బదిలీ చేయడం కూడా ఇందులో భాగమేనంటున్నారు.ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన ఐఏఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా హరిత ఐటీడీఏ(కేఆర్‌పురం)ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. అయితే ఆమె బాధ్యతలు తీసుకోకుండా సెలవులో ఉన్నారు. ఈక్రమంలో గతవారం జరిగిన ఐఏఎస్ అధికారుల బదిలీల్లో అనంతపురం జేసీగా నియమించడంతో బాధ్యతలు తీసుకునేందుకు సన్నద్ధం అవుతుండగా టీడీఆర్ బాండ్లపై విచారణ అంశం తెరపైకి వచ్చినట్లు తెలిసింది. దీంతో ఆమె నియామకాన్ని రద్దు చేస్తూ, సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ)లో రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. గతంలో తిరుపతి కమిషనర్‌గా ఉన్నప్పుడు టీడీఆర్ బాండ్ల జారీలో ఆమె పాత్రమై కూడా ఆరోపణలు వచ్చాయి.వ్యవసాయ భూమిని, రెసిడెన్షియల్ ప్లాట్లను కమర్షియల్ స్థలాలుగా చూపి మాస్టర్ ప్లాన్ రోడ్ల కోసం సేకరించారన్న విమర్శలున్నాయి. ఈ క్రమంలో కోట్లాది రూపాయలు టీడీఆర్ బాండ్ల రూపంలో చెల్లించాల్సి వచ్చింది. అదేవిధంగా స్థల యజమానికి కాకుండా వేరే వ్యక్తుల పేరిట బాండ్లను జారీ చేశారన్న ఆరోపణలు వచ్చాయి. స్థల యజమానులకు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా రోడ్డు విస్తరణ చేయడం, కోర్టు ఆదేశాలను కూడా లెక్కచేయకుండా దూకుడుగా వ్యవహరించారని చెబుతారు. ఈ నేపథ్యంలో టీటీడీ మాజీ చైర్మన్ చదలవాడ కృష్ణమూర్తి కూడా తన గ్రూప్ థియేటర్స్ గోడను కూల్చడంపై కూడా హైకోర్టు ఆదేశాలను లెక్కచేయలేదంటూ ఆమె కోర్టు ధిక్కరణ నోటీసులు అందుకోవాల్సి వచ్చింది. అదేవిధంగా ఆమె కుటుంబ సభ్యుల ఇళ్లు, ఆస్తుల కోసమే నగరంలో పలు రోడ్లు వేశారన్న విమర్శలు కూడా ఎదురయ్యాయి. అప్పటి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, డిప్యూటీ మేయర్ అభినయ్‌లతో అంటకాగారన్న విమర్శలు ఉన్నాయి. వారు చెప్పిందంతా చేయడం వల్లనే ఆమెకు ఇప్పుడు విచారణను ఎదుర్కొనే పరిస్థితి వచ్చిందన్న చర్చ జరుగుతోంది. ఇదిలావుంటే తాజాగా 'ఆమె టీడీఆర్ బాండ్ల రూపశిల్పి. నెల్లూరు మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసినప్పుడు నేను చూసిన ఐఏఎస్ అధికారుల్లో హరిత అత్యంత అవినీతిపరురాలు' అని తన 'ఎక్స్'లో టీడీపీ నేత ఆనం వెంకటరమణా రెడ్డి బుధవారం పోస్టు చేయడం విశేషం.

అన్నా క్యాంటీన్ల ప్రారంభం రెండవ దశకు వాయిదా

తిరుపతి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆకలి తీర్చేందుకు ఉద్దేశించిన ప్రతిష్ఠాత్మక అన్నా క్యాంటీన్ల ప్రారంభోత్సవం జిల్లాలో రెండవ దశకు వాయిదా పడింది. గత టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన అన్నా క్యాంటీన్లు పట్టణ, నగర ప్రాంతాల్లో పేద విద్యార్థులు, కూలీలు, నిరుపేదలు, ఆస్పత్రులకు వచ్చే రోగుల సహాయకులకు అమితంగా ఉపయోగపడిన సంగతి తెలిసిందే. పట్టణ ప్రాంత పేద, దిగువ మధ్య తరగతి ప్రజల మనసులు చూరగొన్న ఈ పథకాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా అటకెక్కించింది. అన్నా క్యాంటీన్లను వార్డు సచివాలయాలుగా, అర్బన్ హెల్త్ సెంటర్లుగా, గ్రీవెన్స్ విభాగాలుగా మార్చివేశారు. గత ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే తిరిగి అన్నా క్యాంటీన్లు తెరిచి నిర్వహిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక ఆ హామీని నిలబెట్టుకునే దిశగా నేడు రాష్ట్రవ్యాప్తంగా వంద అన్నా క్యాంటీన్లు ప్రారంభిస్తున్నారు. అయితే వివిధ కారణాల రీత్యా జిల్లాలో మాత్రం అన్నా క్యాంటీన్లను ఈ తొలి విడత ప్రారంభించడం లేదు. రెండవ దశలో ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. గతంలో తిరుపతి నగరంలో నాలుగు, శ్రీకాళహస్తిలో రెండు, గూడూరులో ఒకటి, వెంకటగిరిలో ఒకటి, నాయుడుపేటలో ఒకటి, సూళ్ళూరుపేటలో ఒకటి చొప్పున మొత్తం పది క్యాంటీన్లు నడిచాయి. ఇపుడు ఆ పదింటితో పాటు పుత్తూరులో ఒక క్యాంటీన్ వెరసి 11 క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నారు. అయితే వీటిని రెండవ దశలో ప్రారంభించనున్నారు.

శ్రీకాళహస్తి, సత్యవేడు, చంద్రగిరిల్లో

ఆగిన ఇసుక తవ్వకాలు

● అనధికారిక రీచ్‌లను తనిఖీ చేసిన అధికారులు ● 13 ఇసుక ట్రాక్టర్లు సీజ్

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుపతి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి, సత్యవేడు, చంద్రగిరి నియోజకవర్గాల్లో ఇసుక తవ్వకాలు బుధవారం ఆగిపోయాయి. ఈ నియోజకవర్గాల్లోని అనధికారిక ఇసుక రీచ్‌లను సంబంధిత శాఖల అధికారులు, ఉద్యోగులు తనిఖీ చేశారు. ఇసుక తరలిస్తున్న 13 ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఆగని ఇసుక దోపిడీ శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంతో అధికారులు స్పందించారు. అయితే అధికారుల చర్యలు బుధవారానికి మాత్రమే పరిమితమా లేక నిరంతరంగా కొనసాగుతాయా అన్నది వేచి చూడాల్సి వుంది.

తొట్టంబేడు మండలంలోని విరూపాక్షపురం, పెన్నలపాడు గ్రామాల వద్ద స్వర్ణముఖి నదిలో భారీ ఎత్తున సాగుతున్న ఇసుక దోపిడీకి బుధవారం తాత్కాలికంగా అడ్డుకట్ట పడింది. ఈ రెండు ప్రాంతాలను తహసిల్దారు మధుసూదన రావు తనిఖీ చేశారు. శ్రీకాళహస్తి ఎస్ఈబీ సీఐ దశరధరామిరెడ్డి సిబ్బందితో కలసి తనిఖీలు చేపట్టి రెండు ట్రాక్టర్లను సీజ్ చేశారు. శ్రీకాళహస్తి మండల పరిధిలో ఇసుక తవ్వకాలు జరిగే ప్రదేశాలను ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి తనిఖీ చేశారు. నాగలాపురం, పిచ్చాటూరు మండలాల్లో ఇసుక తవ్వకాలు జరుపుతున్న ప్రాంతాల్లో రెవిన్యూ, పోలీసు, సెబ్ బృందాలు తనిఖీ చేశాయి. చంద్రగిరి మండలంలో ఇసుక తవ్వకాలు జరిగే తొమ్మిది ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9.30 గంటల వరకూ తవ్వకాలు యధావిధిగా కొనసాగాయి. ఆ తర్వాత సెబ్, పోలీసు, రెవిన్యూ, సచివాలయ సిబ్బంది తనిఖీలు చేసి తవ్వకాలను నిలిపివేయించారు. దీనిపై తహసిల్దారు శివరామ సుబ్బయ్య మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవ ఏర్పాట్ల కారణంగా తాను తనిఖీలకు వెళ్ళలేదని చెప్పారు. సంబంధిత వీఆర్వోలు ఈనెల 16వ తేదీ నుంచీ ఇసుక తవ్వకాలు జరిగే ప్రాంతాలపై నిఘా వుంచుతారని చెప్పారు. తిరుపతి రూరల్ మండలంలో సెబ్ అధికారులు తనిఖీలు చేపట్టి ఐదు ట్రాక్టర్లను సీజ్ చేశారు. జిల్లా మొత్తం మీద 13 ట్రాక్టర్లు సీజ్ చేసినట్టు సెబ్ అధికారులు వెల్లడించారు. వీటిలోని 60 టన్నుల ఇసుకను కూడా సీజ్ చేసినట్టు చెప్పారు. సీజ్ చేసిన ట్రాక్టర్లను తిరుపతి ఈస్ట్, తిరుపతి రూరల్, అలిపిరి, తొట్టంబేడు పోలీసు స్టేషన్లలో అప్పగించామని చెప్పారు.



విరూపాక్షపురం వద్ద ఇసుక ట్రాక్టర్ సీజ్

ఐతేపల్లె పంచాయతీ రికార్డుల సీజ్

నిధుల దుర్వినియోగంపై చర్యలు



రికార్డులను తనిఖీ చేస్తున్న అధికారులు

చంద్రగిరి, ఆగస్టు 14: చంద్రగిరి మండలం ఐతేపల్లె పంచాయతీలో 2022-23వ సంవత్సరంలో నిధులు దుర్వినియోగమయ్యాయని ఆడిట్‌లో అధికారులు గుర్తించారు. నిధుల దుర్వినియోగం అప్పట్లో అధికారులకు పిర్యాదుచేసినా పట్టించుకోలేదు. ఫాజిల్లా వైసీపీ సర్పంచ్‌గా ఉండడం వలన ఆడిట్ అభ్యంతరాలపై అధికారులు చర్యలు తీసుకోవాడానికి వెనుకంజవేశారు. టీడీపీ ప్రభుత్వం రావడంతో గ్రామస్తులు నిధుల దుర్వినియోగంపై ముఖ్యమంత్రి చంద్రబాబు పిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి కార్యాలయం విచారణకు ఆదేశించింది. దీనిపై డీపీవో డీఎల్పీవో రుపారాణి, ఎంపీడీవో బాలాజీనాయక్, ఈవోఆర్డీ శశిరేఖతో కమిటీ వేశారు. బుధవారం వారు పంచాయతీ రికార్డులను తనిఖీచేసి అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. రికార్డులను సీజ్ చేశారు. రికార్డులు పరిశీలించి తగు చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

కలెక్టరేట్‌లో అర్ధరాత్రి మాక్ ఆపరేషన్



తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 14: తిరుపతి కలెక్టరేట్‌లో మంగళవారం రాత్రి 9.30గంటలకు ఆక్టోపస్ బలగాలు మాక్ డ్రిల్ నిర్వహించాయి. బిలబిలమంటూ వాహనాలు దిగి తుపాకులు చేతపట్టుకుని ఉగ్రమూకల కోసం లోపలకు చొరబడడంతో కలెక్టరేట్ సిబ్బంది కూడా ఏం జరిగిందో అని ఆందోళన పడ్డారు. ఉగ్రమూకలు ఒకవేళ దాడికి ప్పాలడితే సిబ్బంది ఎలా అప్రమత్తంగా ఉండాలో కళ్లకు కట్టినట్లు పోలీసు, రెవెన్యూ, ఫైర్, మెడికల్ డిపార్ట్‌మెంట్‌తో కలిసి ఆక్టోపస్ బుధవారం అర్ధరాత్రి ఒంటి గంట వరకు మాక్ డ్రిల్ నిర్వహించింది.ఆక్టోపస్ డీఎస్పీ కృష్ణ, ఇన్‌స్పెక్టర్లు రాంబాబు, రవిబాబు, రామచంద్రనాయక్, తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

త్రివర్ణాలతో అలరిస్తున్న కలెక్టరేట్



తిరుపతి(విద్య), ఆగస్టు 14: జిల్లా కలెక్టరేట్ కొత్త సొబగులను రంగరించుకుంది. గురువారం స్వాతంత్య్ర దిన వేడుకల సందర్భంగా కలెక్టరేట్ భవనాన్ని జాతీయ జెండాలోని మూడు రంగుల విద్యుద్దీపాలతో అందంగా తీర్చిదిద్దారు. దీంతో కలెక్టరేట్ త్రివర్ణాలతో జాతీయ పతాకాన్ని తలపిస్తూ అందంగా ఆకర్షిస్తోంది.

రోల్‌బాల్ క్రీడాకారుల హర్ ఘర్ తిరంగా యాత్ర



తిరుపతి(క్రీడలు), ఆగస్టు 14: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని రోల్‌బాల్ క్రీడాకారులు బుధవారం హర్ ఘర్ తిరంగా యాత్ర చేపట్టారు. స్థానిక శ్రీనివాస క్రీడా సముదాయంలో త్రివర్ణ పతాకాన్ని పట్టుకొని ర్యాలీలో పాల్గొనగా, ఎస్పీ సుబ్బరాయుడు, జిల్లా క్రీడాకాధికారి సయ్యద్‌సాహెబ్ ర్యాలీని ప్రారంభించారు. బాలాజీకాలనీ, టౌన్‌క్లబ్ మీదుగా తిరిగి ఎస్వీ ఆర్ట్స్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమ నిర్వహణకు కృషి చేసిన రోల్ బాల్ ప్లేయర్ సెక్రటరి అనిల్‌కుమార్‌ను ఎస్పీ అభినందించారు.ఏఎస్పీ కులశేఖర్, డీఎస్పీలు సూర్యనారాయణ, రామకృష్ణఆచారి, సీఐ మురళీమోహన్ రావు పాల్గొన్నారు.

నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా చూడండి

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 14: వినాయక చవితి నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తిరుపతి వినాయక చవితి నిమజ్జన కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, భానుప్రకాష్‌రెడ్డి ఎస్పీకి వినతి పత్రం సమర్పించారు. 9న జరిగే సామూహిక నిమజ్జనానికి వినాయకసాగర్, చెన్నాయగుంట, దామినేడు చెరువు, గొల్లపల్లి చెరువుల వద్ద రక్షణ, ట్రాఫిక్ ఆంక్షలు, బందోబస్తు కల్పించాలని కోరారు.

360మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్



తిరుపతి అర్బన్, ఆగస్టు 14: జిల్లావ్యాప్తంగా 60 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 360మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు డాక్టర్ అంబేడ్కర్ విద్యాజ్యోతి స్కాలర్‌షిప్ ద్వారా కెనరాబ్యాంకు ఆర్థిక సాయమందించింది. బుధవారం స్థానిక కెనరాబ్యాంకు ప్రాంతీయ కార్యాలయంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్ పంపిణీ కార్యక్రమం జీఎం పాండురంగ ఆధ్వర్యంలో నిర్వహించగా, ముఖ్యఅతిథిగా డీఆర్‌డీఏ పీడీ ప్రభావతి పాల్గొన్నారు.ఎంపిక చేసిన 5నుంచి 7వ తరగతి విద్యార్థులకు రూ.3వేలు, 8నుంచి 10వ తరగతి వరకు రూ.5వేల చొప్పున అందించారు.

17న శెట్టిపల్లి చేపల చెరువు వేలం

తిరుపతి (జీవకోన), ఆగస్టు 14: శెట్టిపల్లి చేపల చెరువుకు ఈ నెల 17న వేలం నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎన్ మౌర్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శెట్టిపల్లి చేపలచెరువు, చక్రాలంబండ గుంటలకు 17వ తేదీ ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం వేయనున్నట్లు తెలిపారు. ఇందులో పాల్గొనే వారు ఆధార్‌కార్డుతోపాటు రూ.10లక్షల సాల్వెన్సీ చెల్లించాన్నారు.

టీడీపీలో చేరిన మాజీ సర్పంచ్

తిరుపతి రూరల్, ఆగస్టు 14: తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం మాజీ సర్పంచ్, వైసీపీనేత టి.చిరంజీవిరెడ్డి,ముదిరాజ్ చంద్ర బుధవారం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తినానీ సమక్షంలో టీడీపీలో చేరారు. పంచాయతీ టీడీపీ ఇన్‌చార్జి చెరుకుల పరంధామ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తుడా స్టాండింగ్ కౌన్సిల్‌గా మనోహర్



తిరుపతి(లీగల్), ఆగస్టు 14: తుడా స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా సీనియర్ లాయర్ ఎన్.మనోహర్ నియమితులయ్యారు. 30ఏళ్లుగా తిరుపతి కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్న ఈయన గతంలో కూడా తిరుపతి మున్సిపాలిటీకి, తుడాకు న్యాయవాదిగా పనిచేశారు.

డీఎస్పీకి సన్మానం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 14: తిరుపతి ఈస్ట్ డీఎస్పీ వెంకట నారాయణను ప్రభుత్వ కాలేజీ అధ్యాపకులు డాక్టర్ నాదెండ్ల శ్రీమన్నారాయణ, డాక్టర్ జలగం రామాంజులు, నూకల వెంకటసురేష్, ధనుంజయనాయక్ తదితరులు సత్కరించారు.

వేమిరెడ్డి దంపతులను కలిసిన టీడీపీ నేతలు



తిరుపతి(ఎమ్మార్‌పల్లి), ఆగస్టు 14: నెల్లూరు టీడీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి దంపతులను టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, డివిజన్ నాయకులు ఎస్వీఎం శ్రీధర్, సురేష్ నాయుడు, జగన్, రవీంద్రరెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.


మంత్రిని కలిసిన ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు



మంత్రి సత్యకుమార్‌కు శ్రీవారి చిత్రపటాన్ని అందిస్తున్న డాక్టర్ సుధారాణి

తిరుపతి(వైద్యం), ఆగస్టు 14: తిరుపతికి బుధవారం వచ్చిన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను తిరుపతిలోని పలు ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు కలిశారు. స్థానిక శ్రీసాయి సుధా ఆస్పత్రి అధినేత డాక్టర్ సుధారాణి, శ్రీరమాదేవి ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ డీబీ శశిధర్‌రెడ్డి శ్రీవారి జ్ఞాపికలను అందజేసి ఘనంగా సన్మానించారు.

వైద్య మంత్రికి ఘన స్వాగతం



తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఆగస్టు 14: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌కు బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. బుధవారం రాత్రి ఆయన తిరుపతికి వచ్చిన సందర్భంగా స్థానిక పద్మావతి అతిథి భవనంలో మంత్రిని కలిసి పూలమాలలువేసి అభినందనలు తెలియజేశారు. స్థానిక బీజేపీ నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, గుండాల గోపీనాథ్‌రెడ్డి, వరప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి మంత్రికి యూనియన్ నేతల వినతి

తిరుపతి(వైద్యం), ఆగస్టు 14: తిరుపతికి వచ్చిన మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను పలువురు యూనియన్ నేతలు కలిసి ఉద్యోగుల, కార్మికుల సమస్యలపై వినతిపత్రాలను అందజేశారు. ఏపీఎన్జీవోస్ జిల్లా ఉపాధ్యక్షుడు నైనారు వరప్రసాద్, కార్యదర్శి బాలాజీలు, ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు రాజా పలువురు యూనియన్ నేతలతో కలిసి ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. రుయాస్పత్రిలోని పారిశుధ్య కార్మికులకు జీతాలు, బెనిఫిట్స్ సక్రమంగా రావడంలేదని ఏఐటీయూసీ నేతలు రాధాకృష్ణ, మహేంద్రలు కార్మికులతో కలిసి వారి సమస్యలను వివరించారు.

డీలర్ల వ్యవస్థ బలోపేతానికి కృషి

సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మాధవరావు



తిరుపతిరూరల్, ఆగస్టు14: కూటమి ప్రభుత్వ సహకారంతో డీలర్ల వ్యవస్థ బలోపేతానికి మరింత కృషి చేస్తామని రేషన్ డీలర్స్ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దివిలీల మాధవరావు తెలిపారు. తిరుపతిలోని డీఆర్‌డీఏ హాల్‌లో బుధవారం జిల్లా రేషన్‌డీలర్ల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ.. రేషన్ డీలర్ల ద్వారా సరుకులు పంపిణీ చేసి..ఎండీయూ వ్యవస్థను రద్దుచేయాలని కోరారు. సంక్షేమ కార్యక్రమాలు డీలర్ల ద్వారా అమలు పరచి కార్మికవేతన చట్టం ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో రూ.18,500, పట్టణప్రాంతాల్లో రూ.24వేల వేతనాన్ని అందించాలని ఆకాంక్షించారు. ఈపాస్ కాటాలు వినియోగంలోకి తెచ్చి డీలర్ల వేలిముద్రలతో వందశాతం తూకంతో సరకులు అందజేసేలా తగు చర్యలు చేపట్టాలని తెలిపారు. గుంటూరుజిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, ప్రధానకార్యదర్శి తుమ్మలగాంధీ, పీటీఎల్ వరప్రసాద్, నెల్లూరుకి చెందిన కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

డీలర్ల సంఘ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

రేషన్ డీలర్ల సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులుగా సీహెచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, జేహెచ్ సాల్మన్‌రాజు, కోశాధికారిగా శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడుగా నిమ్మకాయల రవి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పి.హేమలత, ముఖ్యసలహాదారుడుగా ఇక్బాల్, కార్యదర్శులుగా కోటేశ్వరరావునాయుడు, చంద్రారెడ్డిలతోపాటు ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.




వెంకటేశ్వర్‌రెడ్డి, సాల్మన్‌రాజు

ఎస్వీయూ కో-ఆపరేటివ్ స్టోర్స్‌లో ఉద్యోగ నియామకాలు రద్దు చేయాలి

తెలుగు యువత, టీఎన్‌ఎస్‌ఎఫ్ డిమాండ్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 14: ఎస్వీయూ కో-ఆపరేటివ్ స్టోర్స్ పరిధిలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అన్ని రకాల ఉద్యోగ నియామకాలను రద్దు చేయాలని తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి ఆనంద్‌గౌడ్, టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు ఆర్కే నాయుడు కోరారు. జిల్లా సహకార శాఖ అధికారి లక్ష్మిని బుధవారం వారు కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. ఎస్వీయూ కో-ఆపరేటివ్ స్టోర్స్‌లో గత ప్రభుత్వ హయాంలో జరిగిన కొనుగోళ్లు, అక్రమాలపై విచారణ చేపట్టాలన్నారు. ఇప్పటికే దీనిపై పలు పిర్యాదులు అందాయనీ, విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని లక్ష్మి హామీ ఇచ్చారు. నాయకులు భీష్మ, శ్రీరామ్, రామాంజి, రాజు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రహితంగా తిరుమల, తిరుపతి

తిరుపతి(వైద్యం), ఆగస్టు 14: పవిత్రమైన తిరుమలతోపాటు తిరుపతి నగరాలను పొగాకు రహిత నగరాలుగా మార్చేందుకు కృషి చేస్తామని, ఇందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా స్థానిక పద్మావతి అతిథి గృహంలో ఆయన పొగాకు నియంత్రణకు సంబంధించిన పోస్టరును విడుదల చేశారు. డీఎంహెచ్‌వో శ్రీహరి, వైద్యాధికారులు నిసీది, నిత్య తదితరులు పాల్గొన్నారు.

స్విమ్స్‌లో డాక్టర్ల ర్యాలీ



తిరుపతి(వైద్యం), ఆగస్టు 14: కోల్‌కత్తాలోని ఆర్జీ కర్ వైద్య కళాశాలలో జరిగిన జూనియర్ డాక్టర్ హత్యను నిరసిస్తూ స్విమ్స్‌లోని స్విమ్స్ ఆర్‌డీఎస్‌ఏ(రెసిడెంట్ డాక్టర్స్ స్టూడెంట్స్ అసోసియేషన్) డాక్టర్లు సోమవారం విధులు బహిష్కరించి సమ్మె బాట పట్టారు. ఈ సందర్భంగా వారు స్విమ్స్‌లో నిరసన వ్యక్తం చేస్తూ జూనియర్ డాక్టర్‌ను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వం దేశంలోని డాక్టర్లకు రక్షణచర్యలు చేపట్టి అండగా ఉండాలని కోరారు. ఈ విషయంపై స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్‌కు వినతిపత్రం అందించారు. అదే విధంగా తిరుపతిలోని శ్రీపద్మావతి అతిథి గృహంలో దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిసి తమ సమస్యలను పరిష్కరించి, రక్షణ చర్యలు చేపట్టాలని వినతిపత్రాన్ని అందజేశారు. స్విమ్స్ ఆర్‌డీఎస్‌ఏ నేతలు డాక్టర్ ధీరజ్‌కుమార్, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ శివప్రసాద్ పాల్గొన్నారు.

17న ఉప రాష్ట్రపతి పర్యటన

తిరుపతి(విద్య), ఆగస్టు 14: ఉప రాష్ట్రపతి, ముఖ్యమంత్రి పర్యటనలను విజయవంతం చేసేందుకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. 17న ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్, 19న ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా పర్యటనకు రానుండటంతో ఏర్పాట్ల విషయమై బుధవారం ఎస్పీ సుబ్బారాయుడు, జేసీ శుభం బన్సల్, మున్సిపల్ కమిషనర్ మౌర్య, ఆర్డీఓ పెంచలకిషోర్‌తో కలిసి కలెక్టరేట్‌లో అన్ని శాఖల అధికారులతో సమావేశమయ్యారు.

మీటర్ రీడర్ల సమస్యలను పరిష్కరించండి

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 14:విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న మీటర్ రీడర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్స్ రీడర్ల సంఘం నాయకులు ఎం.బాలకాశి, షేక్ హజరత్‌వలీ డిమాండ్ చేశారు. తిరుపతి విద్యుత్ సర్కిల్ కార్యాలయం ఎదుట బుధవారం మీటర్ రీడర్స్ ధర్నా చేశారు. సర్కిల్ పర్సనల్ అధికారి నాగరాజుకు వినతి పత్రం అందజేశారు.

హైమావతికి డాక్టరేట్



చంద్రగిరి, ఆగస్టు 14: శ్రీ విద్యానికేతన్ నర్సింగ్ కళాశాలలో లైబ్రరీ ఇన్‌చార్జిగా వున్న హైమావతికి కోయంబత్తూరులోని భారతీయార్ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. 'ఇంపార్ట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ ఆన్ రీడింగ్'పై ఎస్వీయూ చీఫ్ లైబ్రేరియన్ ప్రొఫెసర్ కొంగర సురేంద్రబాబు పర్యవేక్షణలో పరిశోధన చేసినందుకు పీహెచ్‌డీ ప్రదానం చేశారు.

ధూమపానానికి యువత దూరంగా ఉండాలి

తిరుపతిరూరల్, ఆగస్టు14: ధూమపాన పదార్థాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్వీ వ్యవసాయ కళాశాల ఏడీ డాక్టర్ ఎంవీ రమణ తెలిపారు. కళాశాలలో జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో బుధవారం పొగాకు రహిత యువత అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు డాక్టర్ గణేష్‌కుమార్, డాక్టర్ శైలజ, డాక్టర్ శాంతి, డాక్టర్ రమణమూర్తి, డాక్టర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలుర గృహాన్ని పరిశీలించిన సెక్రటరీ

మంగళం, ఆగస్టు 14: మంగళం పరిధిలోని ఆర్టీవో కార్యాలయం వద్ద ఉన్న ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని మహిళా సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి బుధవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ వృత్తి శిక్షణలో నైపుణ్యాన్ని పెంచుకుని సమాజంలో మంచి పౌరులుగా బాలురు మెలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు షణ్ముఖరావు, త్రినాధరావు, మోహన్‌బాబు, సుదర్శన్, లక్ష్మీపతి, శ్రీధర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు భరతమాత చిత్రపటాల పంపిణీ



మంగళం, ఆగస్టు 14: మంగళం ట్రెండ్స్ జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యా సంఘం ఆధ్వర్యంలో రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ రమేష్‌నాథ్ విద్యార్థులకు భరతమాత చిత్రపటాలను పంపిణీ చేశారు. అలాగే నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాస్య విద్యాలయ బాలికల వసతిగృహాలకు ట్రంకుపెట్టెలను అందజేశారు. ముఖ్యఅతిథిగా ఉప విద్యాశాఖ అధికారి బాలాజీ, జిల్లా ఆపస్ అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి సాంబిరెడ్డి, సహాధ్యక్షుడు దేవరాజులు పాల్గొన్నారు.

మంచినీళ్ల గుంట కలుషితం

మంగళం, ఆగస్టు 14: తిరుపతిలోని మంచినీళ్ల గుంట డ్రైనేజీ వ్యర్థాలతో కలుషితమై ప్రజలు అనారోగ్య పాలవుతున్నారని కార్పొరేటర్ నరసింహ తెలిపారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రుయా, స్విమ్స్, బర్డ్ ఆస్పత్రులకు సంబంధించి డ్రైనేజీ సక్రమంగా లేకపోవడంతో వ్యర్థాలు భూగర్భ జలాల ద్వారా మంచినీళ్ల కుంట నీటిలో కలుషితమై బోర్ల ద్వారా 60 వేల మంది ప్రజలకు తాగునీరుగా అందుతోందన్నారు. దీని ద్వారా ప్రజలకు చర్మవ్యాధులు, కీళ్ల సమస్యలతో బాధపడుతున్నారని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించాలని పిర్యాదులు చేసినా ఫలితంలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమలో కార్పొరేటర్లు అనిల్, నరేంద్ర, సుబ్రహ్మణ్యం, కృష్ణ పాల్గొన్నారు.

చంద్రగిరి ఆస్పత్రిని అభివృద్ధి చేయండి



చంద్రగిరి, ఆగస్టు 14: చంద్రగిరిలోని పీహెచ్‌సీని మరింత అభివృద్ధి చేయాలని మండల బీజేపీ నాయకుడు సుబ్రహ్మణ్యం యాదవ్ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను కోరారు. ఈ మేరకు మండల బీజేపీ నాయకులతో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. బీజేపీ నాయకులు వెంకటముని, తిలక్‌యాదవ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ముగిసిన శిక్షణ



సర్టిఫికెట్లతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు

తిరుపతి (కలెక్టరేట్), ఆగస్టు 14: తిరుచానూరు రోడ్డులోని మహిళా ప్రాంగణంలో 8 రోజులపాటు జరిగిన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల శిక్షణా తరగతులు బుధవారంతో ముగిశాయి. డీఆర్‌డీఏ పీడీ ప్రభావతి శిక్షణ పొందిన 30మంది మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. జిల్లా పరిశ్రమలకేంద్రం డిప్యూటీ డైరెక్టర్ మురళి, రీజినల్ స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి శ్యామ్‌మోహన్, మహిళా ప్రాంగణం డీఎం ఫర్హానా, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ హర్‌ఘర్ తిరంగ్ యాత్ర



చంద్రగిరి, ఆగస్టు 14: చంద్రగిరిలో భారతీయ యువమోర్చా ఆధ్వర్యంలో బుధవారం హర్‌గర్‌తిరంగ్ యాత్ర నిర్వహించారు. జాతీయ రహదారి నుంచి టవర్‌క్లాక్ వద్ద అంబేడ్కర్ విగ్రహం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువమోర్చ కార్యవర్గ సభ్యులు ఈశ్వర్‌ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటముని, పుష్పలత, సుబ్రహ్మణ్యంయాదవ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే చంద్రగిరిలో బీజేపీ, జనసేన పార్టీల ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగ్ కార్యక్రమం జరిగింది. బీజేపీ నియోజక ఇన్‌చార్జ్ పురుషోత్తం నాయుడు, జనసేన నాయకుడు దేవర మనోహర్, నాయకులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. బీజేపీ నాయకులు రాజేంద్రనాయుడు, విరుపాక్షి నవీన్, కుమార్, విజయకుమార్, శంకర్ రెడ్డి, నాగార్జున గౌడ్, విద్యాసాగర్ రెడ్డి, జనసేన నాయకుడు మురళీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్లూమింగ్ బడ్స్‌లో స్వాతంత్ర్య దిన వేడుకలు



చంద్రగిరి, ఆగస్టు 14: స్థానిక బ్లూమింగ్ బడ్స్ పాఠశాలలో ముందస్తు స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు భారీ త్రివర్ణ పతకాన్ని చేపట్టి వందేమాతరం, జైభారత్, మేరా భారత్ మహాన్ అంటూ నినాదాలతో పాఠశాల నుంచి నాగాలమ్మ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ఛైర్మన్ బి.హితేంద్రనాథ్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

విశ్రాంత సైనికులకు సన్మానం



పాకాల, ఆగస్టు 14: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని విశ్రాంత సైనికులను ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా సన్మానించారు. విశ్రాంత సైనికులు టి.రామచంద్ర, బాలశేఖర్ రెడ్డి, కె.కన్నయ్యనాయుడు, అమర్‌నాథ్‌రెడ్డి, టి.దొరస్వామి, మనోహర్ రెడ్డి, పి.రామ్మూర్తిలను శాలువాలు కప్పి, పూలమాలలు వేసి సన్మానించారు. సైన్యంలో వీరు అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకర్, జడ్పీటీసీ నంగా పద్మజరెడ్డి, ఈవోపీఆర్డీ మాలతి, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీఎల్‌వోలకు ఎన్నికల బకాయిలు చెల్లించాలి

పాకాల, ఆగస్టు 14: ఎన్నికల విధులు నిర్వహించిన బీఎల్‌వోలకు బకాయిలు వెంటనే చెల్లించాలని బీఎల్‌వోలు కోరారు. బుధవారం ఈ మేరకు వారు తహసీల్దార్ నిత్యానందబాబుకు వినతిపత్రం అందజేశారు. పోలింగ్ కేంద్రాలలో సొంత డబ్బు వ్యయం చేసి విధులు నిర్వహించామన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ బకాయిలు చెల్లించేలా చర్యలు చేపడుతామన్నారు. ఈనెల 20నుంచి ఓటరు జాబితా ప్రత్యేక క్యాంపులు ఏర్పాటుపై చర్చించారు.


శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.35 కోట్లు

తిరుమల, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.35 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు రూ.4.35 కోట్లు ఆదాయం లభించినట్టు టీటీడీ బుధవారం ఉదయం ప్రకటించింది. ఇక, మంగళవారం 73,246 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే 28,133 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

తిరుమలలో స్వాతంత్ర్య దిన వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

తిరుమల, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని గోకులంలో గురువారం స్వాతంత్య్ర దిన వేడుకలకు గోకులం విశ్రాంతి భవనం సన్నద్ధమైంది. గురువారం ఉదయం 7 గంటలకు జాతీయ జెండాను టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి వినీలాకాశంలో ఎగురవేసి గౌరవ వందనం చేయనున్నారు. అనంతరం భక్తులు, సిబ్బందిని ఉద్దేశించి స్వాతంత్య్ర దినోత్సవ సందేశాన్ని అందించనున్నారు.

తిరుమలలో బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ ప్రారంభం



తిరుమల, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని బ్యాంకింగ్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన బ్యాంక్ ఆఫ్ ఇండియా(బీవోఐ) నూతన బ్రాంచ్‌ను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి బుధవారం ప్రారంభించారు. బీవోఐ జీఎం మనోజ్ కుమార్ శ్రీవత్సవ మీడియాతో మాట్లాడుతూ టీటీడీ ఏదైనా సర్వీస్ భక్తులకు ఇవ్వమని కోరితే అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. జోనల్ మేనేజర్ బంగార్రాజు, డిప్యూటీజోనల్ మేనేజర్ సూర్యకిరణ్, చీఫ్ మేనేజర్లు మహేష్, శ్రీనివాస్ శాస్త్రి, ఢిల్లీ బాబు, సీనియర్ బ్రాంచ్ మేనేజర్ సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి నాణ్యమైన కరెంటు సరఫరా

భాకరాపేట, ఆగస్టు 14 : వ్యవసాయానికి తొమ్మిది గంటలు పగటి పూట నాణ్యమైన కరెంటు సరఫరా చేస్తామని ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్, హెచ్‌ఆర్‌డీ సుబ్బరాజు తెలిపారు. బుధవారం ఆయన చిన్నగొట్టిగల్లులోని సబ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. విద్యుత్ సమస్యలకు టోల్ ఫ్రీ నెంబరు 1912కు ఫిర్యాదు చేయాలన్నారు. ఈఈ మునిచంద్ర, డీఈ శివయ్య, ఏఈ ప్రదీప్ పాల్గొన్నారు.

చిత్తూరు ఎంపీకి సన్మానం



చంద్రగిరి, ఆగస్టు 14: చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌ను మండల టీడీపీ నాయకులు బుధవారం సన్మానించారు. తిరుపతి నుంచి చిత్తూరుకు వెళుతున్న ఎంపీకి చంద్రగిరిలో టీడీపీ జిల్లా ఎస్సీసెల్ నాయకుడు వేణు ఆధ్వర్యంలో స్వాగతం పలికి శాలువకప్పి సన్మానించారు టీడీపీ నాయకులు కేసీ నాయుడు, గాలి సతీష్, లలితకుమారి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్ హిందువులకు ప్రపంచం అండగా నిలవాలి

ఎర్రావారిపాలెం, ఆగస్టు 14 : బంగ్లాదేశ్ మైనార్టీ హిందువుల పట్ల ప్రపంచ దేశాలు అండగా ఉండాలని ఉపాధ్యా సంఘ నాయకులు కోరారు. వారు మీడియాతో మాట్లాడుతూ జైతే ఇస్లాం గ్రూప్ అల్లరి మూకలు ప్రవర్తిస్తున్న ఘటనలు ప్రపంచ మానవాళిని కలచివేస్తున్నాయన్నారు. భారత ప్రభుత్వం హిందువులపై దాడులు ఆగేందుకు సంప్రదింపులు చేపట్టాలన్నారు. ఫ్యాక్టో నాయకులు మల్లీశ్వర్, సుబ్బరాజు , మల్లెల సిద్ధయ్య, మంచినీళ్ళ వెంకటరమణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి

పాకాలలో కోర్టు భవనాలకు ప్రారంభోత్సవం


కోర్టు భవనాలను ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు

పాకాల, ఆగస్టు 14: హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్,హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ రావ్ రఘు నందన్ రావు డిజిటల్ విధానంలో పాకాలలో నిర్మించిన కోర్టు భవనాలను బుధవారం ప్రారంభించారు.జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు సర్వ మత ప్రార్థనలు, పూజలు చేసి న్యాయసేవలు ప్రారంభించారు. మూడు కోట్ల రూపాయల వ్యయంతో 2.45 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన కోర్టు భవనాల ప్రారంభోత్సవంలో ఎస్పీ సుబ్బరాయుడు, ఏఎస్పీ వెంకట్రావు, ప్రోటోకాల్ జడ్జి శ్రీనివాసులు, పాకాల జూనియర్ సివిల్ జడ్జి షేక్ బాబాజాన్, కోర్టు సూపరిం టెండెంట్ రాజేష్, పాకాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.మధుసూదన రెడ్డి, ఉపాధ్యక్షుడు చిన్నరెడ్డప్పనాయుడు, కార్యదర్శి గౌరీశంకర్ రాజు, న్యాయ వాదులు జి.గురుస్వామినాయుడు, సుబ్రమణ్యం రెడ్డి, ఎస్ఎన్ఎం సలీం, ప్రవీణ్ ప్రకాష్, జి.చంద్రమోహన్, మురళి, రామనారాయణ రెడ్డి, మధుసూద న్ రెడ్డి, జిల్లా కోర్టు మేనేజర్ చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సివిల్ రైట్స్ డే ఎందుకు నిర్వహించడంలేదు?

● రెవెన్యూ అధికారులపై ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యుడి ఆగ్రహం


ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో సమావేశమైన ఆనంద్ ప్రకాష్

తిరుపతి(విద్య), ఆగస్టు 14: ఎస్సీ ఎస్టీ కమిషన్ సమీక్ష సమావేశానికి రెవెన్యూ అధికారులందరూ హాజరు కాకపోవడంపై కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. తిరుపతి డివిజన్‌లో సివిల్ రైట్స్ డే నిర్వహించకపోవ డంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యుడు చెల్లం ఆనంద్ ప్రకాష్ బుధవారం తిరుపతి ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్లోని అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.తొమ్మిది మండలాల తహశీల్దార్లకు ముగ్గురు మాత్రమే హాజరవడంపై కమిషన్ సభ్యుడు ఆనంద్ ప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి నెలా నిర్వహించాల్సిన సివిల్ రైట్స్ డేని ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. తిరుపతి ఆర్డీవో నిషాంత్‌రెడ్డి సమాధానం చెప్పలేక ఊరకుండిపోవడంతో ఇక నైనా నిబంధనలు పాటించండని ఆనంద్ ప్రకాష్ హితవు చెప్పారు. ప్రతి నెలా చివరి రోజున మండలస్థాయిలో సివిల్ రైట్స్ డే నిర్వహించా లని రెవెన్యూ, పోలీసు అధికారులు తప్పక పాల్గొని బడుగులు, బలహీ నులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని ఆదే శించారు.జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి చెన్నయ్య, అట్రాసిటీ డీఎ స్పీలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

16 నుంచీ ఐసెట్ సర్టిఫికెట్ల పరిశీలన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 14: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశా నికి చేపట్టిన ఐసెట్‌లో ర్యాంకులు పొందిన వారికి ఈ నెల 16 నుంచీ 21వ తేదీ దాకా సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టనున్నట్లు ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయు డు వెల్లడించారు. ఎస్వీయూ అడ్మిషన్ల విభాగంలో ఈ ప్రక్రియ నిర్వహిస్తారని, ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఫీజుతో విద్యార్థులు హాజరు కావాలని సూచించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బస్సు



● త్రుటిలో తప్పిన ప్రమాదం

రామచంద్రాపురం, ఆగస్టు 14: ఎదురుగా కట్టెలలోడ్‌తో వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయిన ఆర్టీసీ బస్సు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది.వెంటనే డ్రైవర్ బస్సును ఆపి ప్రయాణికులను కిందకు దించేయడంతో 35మంది సురక్షి తంగా బయటపడ్డారు.రామచంద్రాపురం మండలంలోని తిరుపతి-పచ్చికా పల్లం ప్రధాన రహదారిలో వున్న పీవీపురం వద్ద మంగళవారం రాత్రి ఈ సంఘటన జరిగింది. గ్రామస్థుల కథనం మేరకు... తిరుపతి డిపో నుంచి 35మంది ప్రయాణీకులతో తమిళనాడు రాష్ట్రం పళ్లిపట్టుకు మంగళవారం రాత్రి 9గంటలకు బస్సు బయలుదేరింది.పీవీపురం వద్ద ఎదురుగా కట్టెల లోడ్ ట్రాక్టర్ రావడంతో డ్రైవర్ ట్రాక్టర్‌ను తప్పించబోయి విద్యుత్‌స్తంభా న్ని ఢీకొట్టారు. దీంతో విద్యుత్ స్తంభం విరిగి బస్సుపై పడింది. డ్రైవర్ ముందుకు వెళ్లకుండా ప్రయాణికులను కిందకు దించడంతో 35మంది సురక్షితంగా బయటపడ్డారు. డ్రైవర్ ఏమాత్రం ముందుకు వెళ్లినా విద్యుత్ వైర్లు బస్సుపై పడి పెద్దప్రమాదం సంభవించేది. సమాచారం అందుకున్న ఆర్టీసీ, విద్యుత్‌శాఖ సిబ్బంది బుధవారం ఉదయం సంఘటనా స్థలానికి చేరుకుని జేసీబీ సాయంతో విద్యుత్ స్తంభాన్ని బస్సుపై నుంచి తొలగిం చారు.



మాజీ సైనికులకు సన్మానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 14: దేశం కోసం సైనికులూ, వారి కుటుంబాలు చేసిన త్యాగం అజరామరమైనదని పద్మావతి వర్సిటీ వీసీ ఉమ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా మాజీ సైనికులు, కుటుంబ సభ్యులను మహిళా యూనివర్సిటీ బుధవారం సన్మానించింది. వీసీ ఉమ మాట్లాడుతూ.. దేశంకోసం ప్రాణాలకు సైతం జడవని సాహసం సైనికులదని కొనియాడారు.అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.రిజిస్ట్రార్ రజని, నగర కమిషనర్ మౌర్య ,పర్యాటక శాఖ ప్రాంతీయాధికారి రమణప్రసాద్,ఏఎస్పీ కులశేఖర్, వే ఫౌండేషన్ చైర్మన్ పైడి అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

यूनियन बैंक ऑफ इंडिया Union Bank of India

దామలచెరువు శాఖ (23001), ఇ.నెం.1-94,రామాలయం వీధి, దామలచెరువు, తిరుపతి జిల్లా - 517152, ఫోన్ 9321823001

ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ సెక్యూరిటీ ఇంటరెస్ట్ కోసం చట్టం 54 ఆఫ్ 2002 లోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు

తేది: 30.07.2024

1) రుణగ్రహీతలు:
1ఎ) కె.కె.ఫుడ్స్, భాగస్వామ్య సంస్థ, డి.నెం.3-185/3, దామలచెరువు గ్రామం & గ్రామ పంచాయతీ, పాకాల మండలం, తిరుపతి జిల్లా - 517152
1బి) శ్రీ కె.అహ్మద్ బాషా, తండ్రి ఖాదర్‌సాహెబ్ (మేనేజింగ్‌పార్టనర్ & గ్యారంటారు)
1సి.) శ్రీ కె.అష్రఫ్ అలీ, తండ్రి ఖాదర్ సాహెబ్ (మేనేజింగ్‌పార్టనర్ & గ్యారంటారు)
1డి.) శ్రీమతి కె.నవనిహార్, భర్త కె.అష్రఫ్ అలీ (భాగస్వామి & గ్యారంటారు)
1ఇ.) శ్రీమతి కె.ఫరీదా, భర్త కె.అహ్మద్ బాషా (భాగస్వామి & గ్యారంటారు)
అందరి నివాసం నెం.1-407, బజారు వీధి, దామలచెరువు గ్రామం, పాకాల మండలం, తిరుపతి జిల్లా - 517152
2) గ్యారంటారు(లు):-
2ఎ) శ్రీమతి కె.అమీనా బీ (చనిపోయిన కారణంగా ఈమె వారసులు) భర్త కె.ఖాదర్ సాహెబ్ నెం.1-407, బజారు వీధి, దామలచెరువు గ్రామం, పాకాల మండలం, తిరుపతి జిల్లా - 517152
2బి) శ్రీమతి జి.మస్తాన్, తండ్రి లేట్ ఖాదర్, 1-287, మసీదు వీధి, దామలచెరువు గ్రామం, పాకాల మండలం, తిరుపతి జిల్లా - 517152
2సి) శ్రీమతి బి.ఇబ్రబున్ బీ, భర్త సాబ్‌జాన్ సాహెబ్, 4-113, రహంత్‌నగర్, పాకాల, తిరుపతి జిల్లా - 517152
2డి) శ్రీమతి ఎస్.ఖైరున్‌బీ (చనిపోయిన కారణంగా ఈమె వారసులు) భర్త ఎస్.ఐ.మజీర్ దామలచెరువు గ్రామం, పాకాల మండలం, తిరుపతి జిల్లా
2ఇ) శ్రీ కె.సాహెబ్‌పీర్ సాహెబ్, కేరాఫ్ అహ్మద్ బాషా, నెం.1-407, బజారు వీధి, దామలచెరువు గ్రామం, పాకాల మండలం, తిరుపతి జిల్లా - 517152

సర్/ మేడమ్,

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెసట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002, సెక్షన్ 13(3)తో చదువబడే సెక్షన్ 13(2) క్రింద నోటీసు **తేది: 30.07.2024** న అధీకృత అధికారి, దామలచెరువు శాఖ (23001), వారి నుండి మీరు చివరిగా తెలిపిన చిరునామాలో మీ రుణఖాతాలోని బకాయిలను తిరిగి చెల్లించమని పిలుపునిచ్చే డిమాండ్ నోటీసు జారీ చేయబడింది. కాని బట్వాడా చేయబడకుండా తిరిగి మాకు చేరింది. అందువల్ల ఈడిమాండ్ నోటీసులోని విషయాలు ఈ వార్తాపత్రికలో ప్రచురించబడుతున్నాయి.

తేది: 25.07.2024 న మీరు పొందిన రుణసౌకర్యాలు / అప్పులను మొండి బకాయిలు గా (ఎన్‌పిఏ)గా వర్గీకరించడమైనది. ఋణము పొందినప్పుడు బ్యాంకునకు మీరు భద్రతా ప్రమాణాలుగా రుణపత్రాలను ఒడంబడిక చేశారు. ఇందులోని రుణసౌకర్యాల నిమిత్తం సురక్షిత ఆస్తుల వివరాలు క్రింది విధంగా వున్నాయి.**30.06.2024** నాటికి **రూ.27,08,533.17** (ఇరవై ఏడు లక్షల ఎనిమిది వేల ఐదు వందల ముప్పై మూడు రూపాయల పదిహేడు నయాపైసలు మాత్రమే) తో క్రెడిట్ సౌకర్యాలు పొందబడ్డాయి.

సెక్యూర్డ్ ఆస్తి వివరములు

ఆస్తి-1:- తిరుపతి జిల్లా, పాకాల మండలం, దామలచెరువు గ్రామలెక్కదాఖలా సర్వే నెం.1733/1 & 1733/2లో ఎ.2.58 సెంట్లు స్థలంలో వున్న డి.నెం.3-185/3 గల ఫ్యాక్టరీ భూమి మరియు బిల్డింగ్ శ్రీ కె.అహ్మద్ బాషా మరియు కె.అష్రఫ్ అలీకి చెందినది. హద్దులు: తూర్పు: కె.అహ్మద్ బాషా భూమి, పడమర: దామలచెరువు టు మంగళంపేట రోడ్డు, ఉత్తరం: రెహమత్‌తుల్లా ఆస్తి, దక్షిణం: చిన్నబ్బ భూమి.

ఆస్తి-2:- తిరుపతి జిల్లా, పాకాల మండలం, దామలచెరువు, బజారు వీధి, సర్వే నెం. 890/2ఎ/2, లోని డి.నెం.1-475 గల కమర్షియల్ భూమి మరియు బిల్డింగ్ యొక్క విస్తీర్ణం 480 చ.గ. శ్రీ కె.అహ్మద్ బాషా మరియు కె.అష్రఫ్ అలీ పేరున వున్నది. హద్దులు: తూర్పు: అబ్బన శెట్టికి చెందిన డి.నెం.1-475, పడమర: జి.దిల్షాబ్‌కు చెందిన స్థలం, ఉత్తరం: రోడ్డు, దక్షిణం: ఎస్.ఎ.బాషాకు చెందిన భూమి,

ఆస్తి-3:- సర్వే నెం. 1524/3ఎ, 582/2 మరియు 1524/3 లోని కె.అహ్మద్ బాషా మరియు కె.అష్రఫ్ అలీకి చెందిన కమర్షియల్ భూమి వివరాలు ఈ దిగువ ఇవ్వడమైనది.

షెడ్యూలు-ఎ: ఐటంనెం.1:- చిత్తూరు జిల్లా, పాకాల మండలం, దామలచెరువు, మ్యాంగో నగర్, మెట్ట సర్వేనెం.1524/3ఎ లోని 1224 చ.అ. లేదా 136చ.గ. ల స్థలానికి హద్దులు: తూర్పు: మునిలక్ష్మమ్మ స్థలం, పడమర: 24అ. రోడ్డు, ఉత్తరం: కె.అష్రఫ్ అలీకి చెందిన భూమి, దక్షిణం: విక్రయదారుని వద్దనున్న భూమి.

ఐటంనెం.2:- చిత్తూరు జిల్లా, పాకాల మండలం, దామలచెరువు, మ్యాంగో నగర్, మెట్ట సర్వేనెం.1524/3ఎ లోని 1224 చ.అ. లేదా 136చ.గ. ల స్థలానికి హద్దులు: తూర్పు: జి.వెంకటరత్నం శెట్టి స్థలం, పడమర: 24అ. రోడ్డు, ఉత్తరం: జి.ఎన్.బాబుకు చెందిన భూమి, దక్షిణం: కె.అహ్మద్‌బాషా

షెడ్యూలు-బి: ఐటంనెం.1:- చిత్తూరు జిల్లా పాకాల మండలం, దామలచెరువు గ్రామం, మౌలాలి రెసిడెన్షియల్ ఏరియా సర్వేనెం.582/2 లోని స్థలం విస్తీర్ణం ఎ.0.11 సెంట్లు లేదా 528 చ.గ. హద్దులు: తూర్పు: రాజేశ్వరి భూములు, పడమర: కె.అహ్మద్ బాషా భూములు, ఉత్తరం: కె.అబ్బున్నశెట్టికి చెందిన భూమి, దక్షిణం: జి.సయ్యదుల్లా సాహెబ్ భూములు.

ఐటంనెం.2: సర్వేనెం.582/2 లోని ఎ.0.17 సెంట్లులేదా 916 చ.గ. భూమికి హద్దులు: తూర్పు: కె.అష్రఫ్ అలీ భూములు, పడమర: చెరువు కాల్వ, ఉత్తరం: కె.అబ్బున్నశెట్టి భూమి, దక్షిణం: జి.సయ్యదుల్లా సాహెబ్ భూములు

షెడ్యూలు-డి: -ఐటంనెం.1:- చిత్తూరు జిల్లా, పాకాల మండలం, దామలచెరువు, మ్యాంగో నగర్, సర్వేనెం.1524/3లోని 133.33 చ.గ. స్థలానికి హద్దులు: తూర్పు: ఎస్.గౌసూర్ బాషా మ్యాంగో మండి, పడమర: ఐటంనెం.2లోని స్థలం, ఉత్తరం: దరఖాస్తుదారుని స్థలం, దక్షిణం: మౌలా బాషా మ్యాంగో మండి.

ఐటంనెం.2:- చిత్తూరు జిల్లా, పాకాల మండలం, దామలచెరువు, మ్యాంగోనగర్, సర్వే నెం.1524/3 లోని 119 చ.గ. స్థలానికి హద్దులు: తూర్పు: ఐటంనెం.1లోని స్థలం, పడమర: రాజా వీధి, ఉత్తరం: దరఖాస్తుదారుని స్థలం దక్షిణం: మౌలా బాషా మ్యాంగో మండి.

ఆస్తి-4:- తిరుపతి జిల్లా, పాకాల మండలం, దామలచెరువు బజారు వీధి, డి.నెం.1-407 లోని భూమి మరియు నివాసయోగ్యమైన బిల్డింగ్ (జి.ఎఫ్ + ఎఫ్ఎఫ్) యొక్క విస్తీర్ణం 1451.25 చ.అ. లేదా 161.25చ.గ. శ్రీ కె.అహ్మద్ బాషా, కె.అష్రఫ్ అలీ, కె.అమీనాబీ, ఎస్. ఖైరున్‌బీ మరియు బి.జాంరుయున్‌బీ లకు చెందినది. హద్దులు: తూర్పు: ఎస్.మునిరత్నం శెట్టి ఇల్లు, పడమర: కె.అబ్బున్నశెట్టికి చెందిన ఆస్తి, ఉత్తరం: దరఖాస్తుదారుని స్థలం, దక్షిణం: బజారు వీధి.

కాబట్టి నెం.1 అయిన ఋణగ్రహీతలు మరియు నెం.2 అయిన గ్యారంటారులు పైన పేర్కొన్న **రూ.27,08,533.17 (ఇరవై ఏడు లక్షల ఎనిమిది వేల ఐదు వందల ముప్పై మూడు రూపాయల పదిహేడు నయాపైసలు మాత్రమే)** మొత్తాన్ని భవిష్యత్తు వడ్డీ మరియు ఛార్జీలతో కలిపి ఈ ప్రచురణ తేది నుండి 60 రోజులలోపు చెల్లించవలసిందిగా నోటీసు ద్వారా పిలుపునిచ్చాము. చెల్లింపులో మీరు విఫలమైతే సురక్షితమైన రుణదాత అయిన మేము, సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 సెక్షన్ 13(13) ప్రకారం దానిని పాటించడంలో సెక్షన్ 13(4) లోని కింది హక్కులను వినియోగించుకోవడానికి అర్హులము.ఈ చట్టం ప్రకారం మీరు బ్యాంకు యొక్క ముందస్తు అనుమతి లేకుండా నోటీసు అందిన తేది నుండి పైన పేర్కొన్న ఈ భద్రపరచబడిన ఆస్తులను ఎవ్వరికి బదిలీ చేయకూడదు. సురక్షితమైన ఆస్తులను తిరిగి పొందడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13 లోని సబ్ సెక్షన్(8) లోని నిబంధనలను దయచేసి చదువుకోగలరు.

ప్రదేశం:దామలచెరువు
తేది: 30.07.2024

సం॥ చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం



అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న ఆర్డీవో కిరణ్‌కుమార్

గూడూరు, ఆగస్టు 14: స్థానిక ఏపిరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో గురువారం నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవాలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని ఆర్డీవో కిరణ్‌కుమార్ దిశానిర్దేశం చేశారు. బుధవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో గూడూరు, నాయుడుపేట డివిజన్ పరిధిలోని వివిధ శాఖల అధికారులతో జెండా పండుగపై సమీక్షించారు. ఈ ఏడాది 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ జాతీయజెండాను ఆవిష్కరిస్తారన్నారు. వివిధ శాఖలకు చెందిన పది శకటాలతో ప్రదర్శన ఉంటుందన్నారు. 16 కళాజాతా, కేరళ బృందాలు, విద్యార్థుల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలుంటాయన్నారు. ఈ వేడుకల్లో గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి, సత్యవేడు ఎమ్మెల్యేలు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రమణకుమార్, వివిధశాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎల్లుండి ఉచిత క్యాన్సర్ వైద్యశిబిరం

గూడూరు అర్బన్, ఆగస్టు 14: స్థానిక అశోక్‌నగర్‌లోని కేవీఆస్పత్రి వద్ద ఈనెల 17న క్యాన్సర్ ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి నిర్వాహకులు పేర్కొన్నారు. శిబిరంలో ఒంగోలుకు చెందిన క్యాన్సర్ వైద్యనిపుణుడు ప్రదీప్‌కుమార్‌రెడ్డి పాల్గొని వైద్యపరీక్షలు నిర్వహిస్తారన్నారు.

పాత గొల్లకండ్రిగలో గంగజాతర వేడుకలు



పిచ్చాటూరు, ఆగస్టు 14: మండలంలోని పాత గొల్లకండ్రిగలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న గంగజాతరలో భాగంగా బుధవారం అమ్మవారిని కుమ్మరి ఇంటి నుంచి వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించి చాకలి ఇంటికి తీసుకొచ్చి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. మేళతాళాలు బ్యాండు వాయిద్యాలు, డప్పు వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. అమ్మవారికి ఇంటింటా నైవేద్యంతో పాటు వేట, కోడి బలులు ఇచ్చి అమ్మవారిని శాంతపరుస్తూ మొక్కులు తీర్చుకున్నారు. పాత గొల్లకండ్రిగ జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆదిమూలం పాత గొల్లకండ్రిగకు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యేను గ్రామస్తులు శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ పంచాయతీ ప్రెసిడెంట్ రాజా, క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, నాయకులు రామాపురం రవి, శ్రీనివాసులు చిన్న, వినాయకం తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా ద్రౌపదీ, అర్జునుల కల్యాణం



పిచ్చాటూరు, ఆగస్టు 14: పిచ్చాటూరులో జరుగుతున్న ధర్మరాజ స్వామి తిరు ణాళ్లలో భాగంగా ద్రౌపదీ, అర్జునుల కల్యాణం కమనీయంగా సాగింది. అశేష భక్తకోటి నడుమ, వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు, బ్యాండు మేళాలు నడుమ కల్యాణం వైభవంగా జరిగింది. అనంతరం శ్రీకృష్ణుడు, అర్జునుడు, ద్రౌపది ఉత్సవమూర్తులను ట్రాక్టర్‌పై అధిష్టించి వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. ప్రజలు స్వామి, అమ్మవార్లకు కొబ్బరికాయలు కొట్టి కర్పూర నీరాజనాలు పలికారు. రాత్రంతా భక్తుల నుంచి కర్పూర నీరాజనాలందుకున్న స్వామి, అమ్మవార్ల ఉదయం ఆలయానికి వేంచేశారు. స్వామి, అమ్మవార్ల వివాహాన్ని తిలకించిన అశేష భక్తజనానికి అన్నదానం చేశారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి



సచివాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న తహసీల్దారు రమేష్‌బాబు

పిచ్చాటూరు, ఆగస్టు 14: మండల కేంద్రమైన పిచ్చాటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, రామగిరి గ్రామ సచివాలయాన్ని తహసీల్దార్ రమేష్‌బాబు బుధవారం తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. హాజరు పట్టి ప్రకారం సిబ్బంది ఉన్నది లేనిది ఆరా తీశారు. ఉద్యోగులు సమయపాలన కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. వర్షాకాలం కావడంతో గ్రామాల్లో వైద్య శిబిరాలు నెలకొల్పి ప్రజలను వ్యాధుల బారి నుంచి రక్షించేందుకు పక్క ప్రణాళికతో ముందుకెళ్లాలని వైద్యాధికారులకు సూచించారు. ఆరోగ్య కార్యకర్తలు ఆశ వర్కర్లు నెలకొంటున్న సమస్యలపై అప్పటికప్పుడు స్పందించి డాక్టర్ల దృష్టికి తీసుకురావాలన్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న తహసీల్దారు

బుచ్చినాయుడు కండ్రిగ, ఆగస్టు 14: ఏకలవ్య గురుకుల పాఠశాలలో విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలని తహసీల్దారు సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని కనమనంబేడు గ్రామంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో బుధవారం విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం అధిక శాతం నిధులు వెచ్చించి రుచికరమైన భోజనాలు పెట్టాలని ఆదేశించిందన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని వార్డెన్‌ను హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీ చంద్రబాబునాయుడు, వీఆర్‌వో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హర్‌ఘర్ తిరంగా ర్యాలీ



పిచ్చాటూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధికారులు

పిచ్చాటూరు, ఆగస్టు 14: మండల కేంద్రంలో ఎంపీడీవో రాధారాణి, తహసీల్దార్ రమేష్‌బాబు, ఎంఈవో హేమమాలిని ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు, ఉపాధి సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ జరిగింది. తహసీల్దారు రాజశేఖర్, ఎంపీడీవో ప్రసాద్, ఈవో బసిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రమణయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు జాతీయ జెండాలను చేతబట్టి పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు.ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రహ్మణ్యం, తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, డీటీ చంద్రబాబునాయుడు, ప్రధానోపాధ్యాయుడు రమణయ్య పాల్గొన్నారు.

శతమానం 'భవంతులు'



సబ్‌రిజిస్ట్రారు కార్యాలయం



తహసీల్దారు కార్యాలయం



సబ్ ట్రెజరీ



సబ్ జైలు

సత్యవేడు, ఆగస్టు 14: బ్రిటీష్ వాళ్లు దేశాన్ని వదిలి వెళ్లినా చాలాచోట్ల వారు కట్టించిన కట్టడాలు మాత్రం పదిలంగా ఉన్నాయి. వంద సంవత్సరాలు దాటినా చెక్కు చెదరకుండా అలనాటి ఇంజనీరింగ్ నైపుణ్యానికి నిదర్శనాలుగా నిలిచి ఉన్నాయి. సత్యవేడులో బ్రిటీష్ పాలనా కాలంలో కట్టించిన అనేక భవంతులు వంద సంత్సరాలు పైబడుతున్నా నేటికి ప్రభుత్వ కార్యాలయాలయాలకు నిలయమై, శతమానం భవంతులుగా విలసిల్లుతున్నాయి. ప్రధానంగా సత్యవేడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని 1880లో అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం నిర్మించింది. దాదాపు 150 సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటికీ సేవలందిస్తూనే ఉంది. వర్షానికి నీరు లీకేజీ అయి రికార్డులు పాడవుతుండడంతో రెండేళ్లక్రితం భవనం పైకప్పులోని పెంకులను తొలగించి రేకులను అమర్చారు. అదేవిధంగా సబ్‌జైలు, తహసీల్దారు, సబ్ ట్రెజరీ కార్యాలయాలు ఇప్పటికీ పటిష్టంగా ఉన్నాయి. సున్నం మిశ్రమం వాడి నిర్మించిన ఈ కట్టడాలు ఇప్పటి ఆర్కిటెక్చర్ నైపుణ్యానికి ఏమాత్రం తీసిపోని విధంగా ఉండడం విశేషం. ఈ భవంతులు మరో వందేళ్ల శతమానం భవంతులుగా వర్ధిల్లాలని కోరుకుందాం.

స్వాతంత్ర్య దినోత్సవానికి సర్వం సిద్ధం





స్టేడియంలో చేపడుతున్న ఏర్పాట్లు - విద్యుత్‌దీపాలతో అలంకరించిన సబ్‌కలెక్టర్ కార్యాలయం

గూడూరు, ఆగస్టు 14: స్థానిక అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో గురువారం నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవాలకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేపట్టారు. మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సుభాస్ చంద్రబోస్ సైకత శిల్పాలాలను సైకత శిల్పి సనత్‌కుమార్ రూపొందించడం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఈ వేడుకలకు హాజరయ్యే విద్యార్థులకు, ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సహకారంతో ఏర్పాట్లును పూర్తి చేశారు. వివిధ శాఖలకు చెందిన స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. సబ్‌కలెక్టర్, తహసీల్దారు కార్యాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు.

విద్యార్థి దశ నుంచే దేశభక్తి చాటుకోవాలి: విజయశ్రీ







సూళ్లూరుపేటలో జరిగిన ర్యాలీలో ఎమ్మెల్యే తదితరులు - నాయుడుపేటలో జరిగిన హర్ ఘర్ తిరంగా ర్యాలీ - ఓజిలో సీనియర్ సిటిజన్‌కు సన్మానం

సూళ్లూరుపేట, ఆగస్టు 14: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ దేశభక్తి చాటుకోవాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో జరిగిన హర్ ఘర్ తిరంగా ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా పట్టణంలోని హోలిక్రాస్ సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండు సెంటర్ వరకు త్రివర్ణ పతాకాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండు సమీపంలో ఉన్న గాంధీజీ, అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. అదే విధంగా స్థానిక వీఎస్‌ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాడెట్స్, విద్యార్థులచే డిగ్రీ కళాశాల నుంచి షార్ బస్టాండు వరకు జెండాలతో ర్యాలీ నిర్వహించారు.

వెంకటగిరి టౌన్: ఏపీ మోడల్ స్కూల్ ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ తులసిజ్యోతి, ఉపాధ్యాయులు హరీష్ కుమార్, ముజీబ్ పాల్గొన్నారు.

ఓజిలి: మండలంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా వెంకటరెడ్డిపాళెంనకు చెందిన సీనియర్ సిటిజన్ వి.సుందరయ్యను అధికారులు సన్మానించారు. తహసీల్దారు పద్మావతి, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: టీఎంఆర్ విద్యా సంస్థల విద్యార్థుల ఆధ్వర్యంలో నాయుడుపేట పట్టణంలోని పోలేరమ్మగుడి నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ జరిగింది. టి.మనోహర్‌రెడ్డి, సురేంద్ర, రాజశేఖర్‌రెడ్డి, కె.సుబ్రహ్మణ్యం, సుందరరావు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సివిల్ రైట్స్ డే ఎందుకు నిర్వహించడంలేదు?

రెవెన్యూ అధికారులపై ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యుడి ఆగ్రహం



తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో సమావేశమైన ఆనంద్ ప్రకాష్

తిరుపతి(విద్య), ఆగస్టు 14: ఎస్సీ ఎస్టీ కమిషన్ సమీక్ష సమావేశానికి రెవెన్యూ అధికారులందరూ హాజరు కాకపోవడంపై కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. తిరుపతి డివిజన్‌లో సివిల్ రైట్స్ డే నిర్వహించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యుడు చెల్లం ఆనంద్ ప్రకాష్ బుధవారం తిరుపతి ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్లోని అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. తొమ్మిది మండలాల తహశీల్దార్లకు ముగ్గురు మాత్రమే హాజరవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి నెలా నిర్వహించాల్సిన సివిల్ రైట్స్ డేని ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. తిరుపతి ఆర్డీవో నిషాంత్‌రెడ్డి సమాధానం చెప్పలేక ఊరకుండిపోవడంతో ఇకనైనా నిబంధనలు పాటించండని ఆనంద్ ప్రకాష్ హితవు చెప్పారు. ప్రతి నెలా చివరి రోజున మండలస్థాయిలో సివిల్ రైట్స్ డే నిర్వహించాలని, రెవెన్యూ, పోలీసు అధికారులు తప్పక పాల్గొని బడుగులు, బలహీనులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని ఆదేశించారు.జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి చెన్నయ్య, అట్రాసిటీ డీఎస్పీలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

పాకాలలో కోర్టు భవనాలకు ప్రారంభోత్సవం



కోర్టు భవనాలను ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు

పాకాల, ఆగస్టు 14: హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్,హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ రావ్ రఘునందన్ రావు డిజిటల్ విధానంలో పాకాలలో నిర్మించిన కోర్టు భవనాలను బుధవారం ప్రారంభించారు.జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు సర్వమత ప్రార్థనలు, పూజలు చేసి న్యాయసేవలు ప్రారంభించారు. మూడు కోట్ల రూపాయల వ్యయంతో 2.45 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన కోర్టు భవనాల ప్రారంభోత్సవంలో ఎస్పీ సుబ్బరాయుడు, ఏఎస్పీ వెంకట్రావు, ప్రోటోకాల్ జడ్జి శ్రీనివాసులు, పాకాల జూనియర్ సివిల్ జడ్జి షేక్ బాబాజాన్, కోర్టు సూపరింటెండెంట్ రాజేష్, పాకాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.మధుసూదన రెడ్డి, ఉపాధ్యక్షుడు చిన్నరెడ్డప్పనాయుడు, కార్యదర్శి గౌరీశంకర్ రాజు, న్యాయవాదులు జి.గురుస్వామినాయుడు, సుబ్రమణ్యం రెడ్డి, ఎస్ఎస్ఎం సలీం, ప్రవీణ్ ప్రకాష్, జి.చంద్రమోహన్, మురళి, రామనారాయణ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, జిల్లా కోర్టు మేనేజర్ చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఇస్రో ఛైర్మన్ ఆధ్వర్యంలో నేడు షార్‌లో స్వాతంత్ర్య దిన వేడుకలు

సూళ్లూరుపేట, ఆగస్టు 14: సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో ఈ సారి స్వాతంత్ర్య దినోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీహరికోటలోని అంతరిక్ష కేంద్రీయ పాఠశాల మైదానంలో జరిగే ఈ వేడుకలకు ఇస్రో ఛైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ కూడా విచ్చేయనున్నట్లు షార్ అధికారులు తెలిపారు. సాధారణంగా షార్ డైరెక్టర్ చేతుల మీదుగా జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారు. ఈ సారి అంతరిక్ష దినోత్సవాలతో పాటు రాకెట్ ప్రయోగం కూడా ఉండడంతో ఇస్రో ఛైర్మన్ విచ్చేసి జెండా ఎగురవేసి ప్రసగించనున్నారు. ఇస్రో ఛైర్మన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దిన వేడుకలు నిర్వహించడం ఇదే తొలిసారి కావడం విశేషం.

షార్ చేరిన రాకెట్ పరికరాల వాహనం..



శ్రీహరికోట నుంచి రాకెట్ ప్రయోగాలకు వినియోగించే పరికరాలను బుధవారం రాత్రి అత్యంత భారీ భద్రత నడుమ ప్రత్యేక వాహనంలో తీసుకెళ్లారు. తమిళనాడులోని మహేంద్రగిరి నుంచి రోడ్డు మార్గానా సీఐఎస్ఎఫ్, పోలీసుల బందోబస్తు నడుమ షార్‌కు తీసుకెళ్లారు.

భూసమస్యలను పరిష్కరించండి

పెళ్లకూరు, ఆగస్టు 14 : మండలంలో భూ రీసర్వే రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించాలని తహసీల్దార్‌ను సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం కోరారు. తహసీల్దార్‌గా ద్వారకానాథ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో సమగ్ర విచారణ చేపట్టి భూసమస్యలు పరిష్కరించాలని కోరారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ రఫి, సర్పంచు డి.నాగేంద్రప్రసాద్‌రెడ్డి, వీఆర్వో రమేష్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బస్సు

●తృటిలో తప్పిన ప్రమాదం



ఆర్టీసీ బస్సుపై విద్యుత్ స్తంభం

రామచంద్రాపురం, ఆగస్టు 14: ఎదురుగా కట్టెలలోడ్‌తో వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయిన ఆర్టీసీ బస్సు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. వెంటనే డ్రైవర్ బస్సును ఆపి ప్రయాణికులను కిందకు దించేయడంతో 35మంది సురక్షితంగా బయట పడ్డారు. రామచంద్రాపురం మండలంలోని తిరుపతి - పచ్చికాపల్లం ప్రధాన రహదారిలో వున్న పీవీపురం వద్ద మంగళవారం రాత్రి ఈ సంఘటన జరిగింది. గ్రామస్థుల కథనం మేరకు.. తిరుపతి డిపో నుంచి 35మంది ప్రయాణీకులతో తమిళనాడు రాష్ట్రం పళ్లిపట్టుకు మంగళవారం రాత్రి 9గంటలకు బస్సు బయలుదేరింది. పీవీపురం వద్ద ఎదురుగా కట్టెల లోడ్ ట్రాక్టర్ రావడంతో డ్రైవర్ ట్రాక్టర్‌ను తప్పించబోయి విద్యుత్‌స్తంభాన్ని ఢీకొట్టారు. దీంతో విద్యుత్ స్తంభం విరిగి బస్సుపై పడింది. డ్రైవర్ ముందుకు వెళ్లకుండా ప్రయాణికులను కిందకు దించడంతో 35మంది సురక్షితంగా బయటపడ్డారు. డ్రైవర్ ఏమాత్రం ముందుకు వెళ్లినా విద్యుత్ వైర్లు బస్సుపై పడి పెద ప్రమాదం సంభవించేది. సమాచారం అందుకున్న ఆర్టీసీ, విద్యుత్‌శాఖ సిబ్బంది బుధవారం ఉదయం సంఘటనా స్థలానికి చేరుకుని జేసీబీ సాయంతో విద్యుత్ స్తంభాన్ని బస్సుపై నుంచి తొలగించారు.

16 నుంచీ ఐసెట్ సర్టిఫికెట్ల పరిశీలన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 14: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి చేపట్టిన ఐసెట్‌లో ర్యాంకులు పొందిన వారికి ఈ నెల 16 నుంచీ 21వ తేదీ దాకా సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టనున్నట్లు ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు వెల్లడించారు. ఎస్వీయూ అడ్మిషన్ల విభాగంలో ఈ ప్రక్రియ నిర్వహిస్తారని, ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఫీజుతో విద్యార్థులు హాజరు కావాలని సూచించారు.

టిప్పర్ ఢీకొని కూలిన సెంటర్ లైటింగ్ పోల్



స్తంభం కూలడంతో ఇబ్బంది పడుతున్న వాహన చోదకులు

గూడూరు అర్బన్, ఆగస్టు 14: స్థానిక కోర్టుసెంటర్ వద్ద బుధవారం వేకువజామున కంకర లోడుతో వెళుతున్న టిప్పరు ఢీకొనడంతో సెంటర్ లైటింగ్ పోల్ కూలిపోయింది. చెన్నూరు నుంచి గూడూరు వైపుకు కంకరతో వెళ్తున్న టిప్పరు అదుపుతప్పి కోర్టు సెంటర్‌లోని సెంటర్‌లైటింగ్ పోల్‌ను ఢీకొనింది. దీంతో స్తంభం నేలకొరిగింది. విద్యుత్ తీగలు తెగి రోడ్డుపై పడ్డాయి. వేకువజాము కావడం, ఆ సమయంలో జనసంచారం లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ట్రాన్స్‌కో అధికారులు సరఫరా నిలిపివేసి మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

భారీ వాహనాలు పట్టణంలోకి రాకుండా చర్యలు తీసుకోండి: సీపీఐ

గూడూరు, ఆగస్టు 14: భారీ వాహనాలు పట్టణంలో రాకపోకలు సాగించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్ కోరారు. సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో అధికలోడు వాహనాల రాకపోకల కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందన్నారు. స్థానిక కోర్టుసెంటర్ కూడలి వద్ద కంకర లోడు టిప్పరు లైటింగ్ పోల్‌ను ఢీకొనడంతో స్తంభం విరిగి పోయిందన్నారు. జనసంచారం లేక పోవడంతో పెను ప్రమాదం తప్పిందన్నారు. భారీ వాహనాలను పట్టణం గుండా రాకపోకలు సాగించకుండా ప్రత్యామ్నాయ మార్గాలను చూపి ప్రమాదాలు జరకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీవీఆర్‌కుమార్, శశికుమార్, నారాయణ, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించండి

సత్యవేడు, ఆగస్టు 14: సత్యవేడు పట్టణంలో రోజురోజుకు అధికమవుతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని సీఐ మురళిని టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి కోరారు. మండలంకు చెందిన పలువురు టీడీపీ నాయకులు ప్రవీణ్ ఆధ్వర్యంలో బుధవారం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐ మురళిని మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి సన్మానించారు. మండలంలో నెలకొన్న సమస్యలను సీఐకి విన్నవించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, డీలర్ సునీల్, శశి, షణ్ముగం, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సర్పంచుల శిక్షణ తరగతులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రశేఖర్

సత్యవేడు, ఆగస్టు 14: మండలంలోని సర్పంచులు, కార్యదర్శులకు పంచాయతీ విధులు, బాధ్యతలు, పారిశుధ్య నిర్వహణ, ఆర్థిక వనరుల సమీకరణ, పంచాయతీ అభివృద్ధికి సంబంధించి ప్రణాళికల రూపకల్పన తదితర అంశాలపై స్థానిక ఎంపీడీవో కార్యాలంలో ఎంపీడీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సర్పంచులు, కార్యదర్శులు పరస్పర సహకారంతో పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. కార్యక్రమంలో ఈవోఅండ్‌ఆర్డీ మునిరవి కుమార్, మండలంలోని 28 పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మూడు రోజుల పాటు జరిగిన కార్యదర్శులు, సర్పంచుల శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. ఎంపీడీవో ప్రసాద్, ఎంవోటీలు శివకుమార్, హరి, ఈవోపీఆర్డీ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

'వెలుగు' నూతన కార్యవర్గం ఎన్నిక



సత్యవేడు, ఆగస్టు 14: వెలుగు మండల మహిళా సమాఖ్య సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఏపీఎం తెలిపారు. బుధవారం వెలుగు ఏపీఎం స్వర్ణలత ఆధ్వర్యంలో స్థానిక స్త్రీశక్తి భవనంలో మండల మహిళా సమాఖ్య సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. అధ్యక్షురాలిగా కోటీశ్వరి (సత్యవేడు,), ఉపాధ్యక్షురాలిగా నందిని(సత్యవేడు), కార్యదర్శిగా మంజుల (దాసుకుప్పం), ఉప కార్యదర్శిగా పద్మమ్మ (ఏఎంపురం), కోశాధికారిగా సుజాత (రాచపాళెం)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వెలుగు లీగల్ కోఆర్డి నేటర్ లక్ష్మయ్య, సీసీ పయణి, అకౌంటెంట్ కాంచన తదితరలు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ

సత్యవేడు, ఆగస్టు 14: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బిలీవ్ ఎఫెక్ట్ ట్రస్టు వ్యవస్థాపకుడు శరవణన్ ఆధ్వర్యంలో బుధవారం సత్యవేడు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, బాలింతలకు డాక్టర్ చంద్రన్ చేతుల మీదుగ పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సెక్రటరి రాజ, సభ్యులు శశికళ, కార్తీక్, కౌసల్య, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగజాతర



కేవీబీపురం, ఆగస్టు 14: మండల కేంద్రమైన కేవీబీపురంలో బుధవారం గంగజాతర వైభవంగా జరిగింది. జాతరను పురస్కరించుకుని అమ్మవారిని విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం అమ్మవారిని సింహ వాహనంపై అధిష్టింపజేసి గ్రామవీధుల్లో ఊరేగించారు. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. సర్పంచు గిరిబాబు, ఎంపీటీసీ అయ్యప్ప, గ్రామకమిటీ సభ్యులు జాతర ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పాడి రైతులను ఆదుకుంటాం: సుధీర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, ఆగస్టు 14: పాడి రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. పట్టణంలోని ప్రైవేటు కల్యాణ మండపంలో బుధవారం కో ఆపరేటివ్ పాల సరఫరా సంఘం జనరల్ బాడీ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే పాలసరఫరా సంఘం అభివృద్ధిపై అధికారులతో చర్చించారు. రైతులను ఆదుకునేందుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేశారు. కార్యక్రమంలో చైర్మన్ మధుసూదన్‌రావు, మేనేజరు మునిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీలపై రాజకీయ వేధింపులు మానుకోవాలి



నిరసన తెలుపుతున్న ఆర్పీలు తదితరులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 14: శ్రీకాళహస్తి పురపాలక సంఘ పరిధిలో పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్ల(ఆర్పీలు)పై రాజకీయ వేధింపులు మానుకోవాలని సీఐటీయూ అనుబంధ ఆర్పీల సంఘం కార్యదర్శి లక్ష్మి అన్నారు. మెప్మా ఆర్పీలపై రాజకీయ వేధింపులకు వ్యతిరేకంగా బుధవారం పురపాలక సంఘ కార్యాలయం వద్ద ఆర్పీల సంఘ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య వారధిగా ఉంటూ పేదల జీవితాల్లో ఆర్థిక వెలుగులు నింపడమే తమ లక్ష్యమన్నారు. ప్రభుత్వం మారగానే గత పాలకులకు అనుకూలంగా పనిచేశామనే నెపంతో పలువురు ఆర్పీలపై రాజకీయ వేధింపులు మొదలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కైలాసగిరి కాలనీలో ఓ ఆర్పీని తొలగించేందుకు కుట్ర జరుగుతోందన్నారు. తమకు రాజకీయ సంబంధాలు అంటగట్టడం సమంజసం కాదన్నారు. అనంతరం కమిషనర్ రమేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్పీల సంఘం అధ్యక్షురాలు సరళాదేవి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య, జిల్లా కార్యదర్శి పెనగడం గువరయ్య, గంధం మణి, సంక్రాంతి వెంకటయ్య, వెలివేంద్రం, ఆర్పీలు శాంతి, అమ్ములు, సుభద్ర, హబీబా, లత తదితరులు పాల్గొన్నారు.

ప్రజాకళా ఉత్సవాలను జయప్రదం చేయండి

శ్రీకాళహస్తి, ఆగస్టు 14: పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో ఈ నెల 31న నిర్వహించే గ్రామీణ జానపద ప్రజాకళా ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచులయ్య పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు గ్రామంలో బుధవారం భజన కోలాట కళాకారుల ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో జానపద కళలైన పండరి భజన, బృందావన భజన, చెక్కభజన, కోలాట భజనలు కనుమరుగైపోతున్నాయన్నారు. కళలను బతికించడానికి ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. కళాకారులకు మూడు సెంట్ల ఇంటి స్థలంతో పాటు నిర్మాణం, ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కళా ఉత్సవాల కన్వీనర్ జనమాల గురవయ్య, నాగరాజు, మించల శివకుమార్, ధనంజయులు, గంగాధరం, కృష్ణయ్య, పెంచలయ్య, గురవయ్య, అమరావతి తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత

శ్రీకాళహస్తి, ఆగస్టు 14: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత అని కార్మిక శాఖ అధికారులు, ప్రగతి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు అన్నారు. బుధవారం పట్టణంలోని పలు షాపింగ్‌మాల్స్, రెస్టారెంట్లు తదితర ప్రాంతాల్లో వారు తనిఖీలు నిర్వహించారు. ముగ్గురు బాల కార్మికులను గుర్తించి నిర్వాహకులను హెచ్చరించారు. బాలకార్మికులను విధుల్లో పెట్టుకున్నట్లు తెలిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు శ్రీమన్నారాయణ, ప్రగతి సంస్థ సిబ్బంది రాజారెడ్డి, మధుబాబు, వెంకటరత్నం, మల్లికార్జున పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి సత్యవేడు

రేపు వరలక్ష్మీ వ్రతం

శ్రీకాళహస్తి, ఆగస్టు 14: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో శుక్రవారం వరలక్ష్మీవ్రతం నిర్వహించనున్నట్లు ఈవో ఎస్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఆలయ అవరణలోని బ్రహ్మగుడి వద్ద ఉదయం 7గంటల నుంచి సామూహిక వరలక్ష్మి వ్రతం జరుగుతుందన్నారు.

అతిగా మద్యం తాగి గుర్తుతెలియని వ్యక్తి మృతి



రేణిగుంట, ఆగస్టు 14: అతిగా మద్యం తాగి గుర్తు తెలియనివ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం ఉదయం పాంచాలినగర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... 40 సంవత్సరాలు కలిగిన వ్యక్తి అతిగా మద్యం తాగి ప్రభుత్వాస్పత్రి రోడ్డులోని ఓ దుకాణం వద్ద మృతి చెంది ఉండటాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని రుయా ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థుల ఉన్నతే లక్ష్యం



సరస్వతీదేవి విగ్రహాన్ని ప్రారంభిస్తున్న రమేష్‌రెడ్డి

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగష్టు 14: పేద విద్యార్థుల ఉన్నతే తన ధ్యేయమని ఎన్ఆర్ఐ రమేష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో ఎన్ఆర్ఐ రమేష్‌రెడ్డి, సుధీర దంపతులు రూ.5లక్షలతో సరస్వతీ దేవి ఆలయం నిర్మించారు. బుధవారం విగ్రహ ప్రతిష్ట చేశారు. కార్యక్రమంలో రమేష్‌రెడ్డి తల్లిదండ్రులు, విశ్రాంత బ్యాంకు మేనేజర్ సుందర్‌రెడ్డి, రాజేశ్వరి, ప్రధానోపాధ్యయుడు రూపేష్ కుమార్, హరగోపాల్‌రెడ్డి, ఉపాధ్యయులు యువశ్రీ మురళి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సత్యకుమార్‌కు స్వాగతం



మంత్రికి స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

రేణిగుంట, ఆగస్టు 14: రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు రేణిగుంట విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. బుధవారం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆయనకు బీజేపీ నాయకులు కోలా ఆనంద్, సామంచి శ్రీనివాస్, భానుప్రకాష్‌రెడ్డి, వరప్రసాద్, తేజోవతి తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన తిరుపతి పద్మావతి అతిథిగృహానికి వెళ్లారు. గురువారం చిత్తూరులోని పెరేడ్ మైదానంలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్రప్రభుత్వం తరపున ముఖ్యఅతిథిగా మంత్రి సత్యకుమార్ పాల్గొంటారు.

హరహరతీర్థం ఆలయానికి కుంభాభిషేకం నిర్వహించండి

శ్రీకాళహస్తి, ఆగస్టు 14: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న హరహర తీర్థం ఆలయానికి కుంభాభి షేకం నిర్వహించాలని పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు కోరారు. బుధవారం ఆయన ఆలయాన్ని సందర్శించారు. గత పాలకమండలి హయాంలో రూ.43లక్షల నిధులతో ఆలయ జీర్ణోద్ధారణ, ఆధునీకరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. రానున్న కార్తీక మాసం లోపు ఆలయానికి కుంభాభిషేకం జరిగేలా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి చొరవ తీసుకోవాలన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

శ్రీకాళహస్తి, ఆగస్టు 14: శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం స్కూల్‌మేళా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు, గొడుగు, యూనిఫాం అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు రమేష్, ఎన్ఆర్ఐ రాజేష్, కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, ఐఐటీ విద్యార్థులు యశ్వంత్, సంజన, నాని పాల్గొన్నారు.

చల్లంగా దీవించు గంగమ్మ తల్లీ..

ముగిసిన రేణిగుంట గంగ జాతర





నడివీధి శూలం వద్ద గంగమ్మ - అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

రేణిగుంట, ఆగస్టు 14: కోరిన కోర్కెలు తీర్చే గంగమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు. రేణిగుంట పట్టణంలో బుధవారం జరిగిన జాతరకు స్థానికులతో పాటు ఇతర ప్రాంతా నుంచి భక్తులు తరలివచ్చారు. మంగళవారం అర్ధరాత్రి సంప్రదాయం ప్రకారం చాకిలి ఇంట్లో పసుపు ముద్దలతో తయారైన గంగమ్మ రూపాన్ని మేళతాళాలతో ఊరేగింపుగా నడివీధి శూలం వద్ద వేపమండపంలో అమ్మవారిని కొలువు దీర్చారు. బుధవారం మధ్యాహ్నం భక్తులు ఉపవాసాలతో అమ్మవారికి వండిన కుంభం కూడును రాత్రి నడివీధి గంగమ్మ వద్దకు చేరుకుని ధూప, దీప నైవేద్యాలతో అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా పట్టణంలోని బజారువీధి జనసందోహంతో నిండిపోయింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సీఐ శరత్‌చంద్ర స్పెషల్ పార్టీ బృందాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి నడివీధి గంగమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అర్ధరాత్రి మండపంలో ఉన్న అమ్మవారిని మేళతాళాలతో ఊరేగించి ఊరు పొలిమేరలో జలాల్లో నిమజ్జనం చేయడంతో జాతర ముగిసింది. ఆయనకు ఆలయ ధర్మకర్త మల్లికార్జున్‌రెడ్డి, మాజీ సర్పంచు జ్యోతినారాయణ, సభ్యులు సదాశివరెడ్డి, రావణ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

మాతా శిశు మరణాల నివారణే లక్ష్యంగా పనిచేయండి



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు

శ్రీకాళహస్తి, ఆగస్టు 14: మాతా శిశు మరణాల నివారణే లక్ష్యంగా వైద్యసిబ్బంది పనిచేయాలని జిల్లా టాస్క్‌ఫోర్సు ప్రధాన అధికారి డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం టాస్క్‌ఫోర్సు బృందం జిల్లా గణాంక అధికారి నాగేంద్రకుమార్, డీపీవో ప్రకాష్‌తో కలిసి శ్రీకాళహస్తి మండలం అమ్మపాళెం విలేజ్ హెల్త్‌క్లినిక్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు, గర్భిణులు, బాలింతలు రక్తహీనతకు గురవకుండా చూడాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే కాన్పులు జరిగేలా చూడాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు ఇచ్చే బలవర్ధక ఆహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి రంజిత, సీహెచ్‌వో ఆసియా బేగం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేడు అమృత్ సరోవర్ల వద్ద జెండా వందనం



కోబాకలో అమృత్ సరోవర్ వద్ద స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న పీడీ

ఏర్పేడు, ఆగస్టు 14: మండలంలో ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో చేపట్టిన అమృత్ సరోవర్ పూడికతీత పనుల వద్దనే గురువారం జెండా వందనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. ఏర్పేడు మండలం కోబాక గ్రామంలో గత ఏడునెలలుగా పూడికతీత పనులు చేసిన ప్రాంతాన్ని బుధవారం సాయంత్రం ఆయన ఉపాధి అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన వెంట ఏపీవో దేవరి ఉన్నారు.

కమనీయం ద్రౌపదీ ధర్మరాజస్వామి కల్యాణం



ఏర్పేడు, ఆగస్టు 14: పాపానాయుడు పేటలోని ద్రౌపదీ సమేత ధర్మారాజస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం ఉదయం 8గంటలకు శాస్త్రోక్తంగా స్వామి అమ్మవార్లకు కల్యాణోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో చేనేత సంఘం నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు మురగప్ప మొదలియార్, అర్జున్‌బాబు, లలిత కరుణాకర్, రోశయ్య, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సీడ్ ఫ్లాగ్‌లు, టీషర్టుల పంపిణీ

వరదయ్యపాళెం, ఆగస్టు 13: సంతవేలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం నందకిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు సీడ్ ఫ్లాగ్స్, టీషర్టులను పంపిణీ చేశారు. హెచ్ఎం మాధవయ్య, ఎస్ఎంసీ చైర్మన్ యుగందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విమానాశ్రయానికి జాతీయ పతాకం వెలుగులు

రేణిగుంట, ఆగస్టు 14: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రేణిగుంట విమానాశ్రయ భవనాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. జాతీయ పతాకం రంగులు ఉట్టిపడేలా వెలుగులు జిమ్ముతున్న దీపపు కాంతులు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం విమానాశ్రయంలో సీఐఎస్ఎఫ్ దళాలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందుకోసం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

మహిళలకు రక్షణ కల్పించాలి: ఎస్ఎఫ్ఐ



విద్యార్థులతో కలిసి నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 14: దేశంలోని మహిళలకు రక్షణ కల్పించేలా పటిష్టమైన చట్టాలను అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. తొట్టంబేడు ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల బద్ద బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు గురవయ్య మాట్లాడుతూ మోదీ పాలనలో మహిళలకు భద్రత కరువైందన్నారు. కలకత్తాలో ఓ మెడికల్ కళాశాలలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం జరిపి దారుణంగా హత్య చేసిన ఘటనలో నిందితుడిని ఇంత వరకు పట్టుకోలేదని విమర్శించారు. వెంటనే నిందితుడిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నాగరాజు, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య సమావేశం

శ్రీకాళహస్తి, ఆగస్టు 14: శ్రీకాళహస్తి వెలుగు కార్యాలయంలో బుధవారం మండల మహిళా సమాఖ్య సమావేశం జరిగింది. మండల సమాఖ్యను ఎన్నుకున్నారు. లీడర్‌గా సుప్రజ, కార్యదర్శిగా సురేఖ, కోశాధికారిగా సుమలత, ఉపాధ్యక్షురాలిగా సుబ్బమ్మ, ఉప కార్యదర్శిగా నిర్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఏరియా కోఆర్డినేటర్ ధనంజయరెడ్డి, ఏపీఎం మునెయ్య, సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజరు నరేష్, లీగల్ కోఆర్డినేటర్ గెరటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘ రైతులు కేవైసీ చేసుకోవాలి

శ్రీకాళహస్తి, ఆగస్టు 14: తంగేళ్లపాళెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సభ్యులుగా ఉన్న రైతులు తప్పనిసరిగా కేవైసీ చేసుకోవాలని సీఈవో చిరంజీవిరెడ్డి తెలిపారు. ఇందుకోసం ఆధార్, పాన్‌కార్డు జిరాక్సులు, రెండు ఫొటోలు, ల్యాండ్ పాస్‌బుక్, ఫోన్ నెంబర్‌తో సహకార సంఘం కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

పిల్లారి దుర్గాప్రసాద్ కళావేదిక ప్రారంభం

శ్రీకాళహస్తి, ఆగస్టు 14: పట్టణంలోని సరస్వతీబాయి పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో బుధవారం పిల్లారి దుర్గాప్రసాద్ కళావేదికను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, పల్లమాల సుధాకర్, తోటకూర కోటేశ్వరరావు, దాతలు పిల్లారి అమరావతి, ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

14న జాతీయ లోక్ అదాలత్



సీనియర్ సివిల్ జడ్జి రాఘువేంద్ర

పుత్తూరు టౌన్, ఆగస్టు 14: పట్టణంలోని కోర్టు ఆవరణలో సెప్టెంబర్ 14వ తేదీ జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ రాజీ మార్గంలో కేసులు పరిష్కరించకోవడం వల్ల సమయం, ధనం ఆదా అవుతుందన్నారు. లోక్ అదాలత్ తీర్పు అంతిమమని, దానిపై అప్పీల్ ఉండదన్నారు. లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా పోలీసులు, న్యాయవాదులు చొరవ చూపాలన్నారు.

మేనరిక వివాహాలు అనర్థదాయకం

వడమాలపేట, ఆగస్టు 14: మేనరిక వివాహాలు అనర్థదాయకమని జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ చెప్పారు. బుధవారం వడమాలపేటలో మొబైల్ సైన్స్ వ్యాన్‌ను ప్రారంభించారు. మండలంలోని పాఠశాలల విద్యార్థులకు మొబైల్ సైన్స్ వ్యాన్‌లోని జన్యువుల నమూనాలు, మేనరిక వివాహాలతో కలిగే నష్టాలు, వంశపారంపర్య వ్యాధుల నివారణ గురించి క్యూరేటర్లు వివరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు పద్మావతి, తులసీరామ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మొబైల్ సైన్స్ వ్యాన్ విశేషాలను వివరిస్తున్న క్యూరేటర్

హర్ ఘర్ తిరంగా ర్యాలీ



జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పుత్తూరు టౌన్, ఆగస్టు 14: పుత్తూరులో హిమజ విద్యాసంస్థల ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హిమజ విద్యాసంస్థల చైర్మన్, కరస్పాండెంట్ సురేంద్ర రాజు, నిషిదరాజు మాట్లాడుతూ ఆగస్టు 15న ప్రతి ఇంట్లో త్రివర్ణ పతాకం ఎగరవేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ధ్రువీ హిమజ, రేష్మ, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ



కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్న రాస్ అధికారులు

పుత్తూరు టౌన్, ఆగస్టు 14: రాష్ట్రీయ సేవా సమితి ఆధ్వర్యంలో జన్ శిక్షణ సంస్థాన్ సహకారంతో టైలరింగ్, ఆర్య వర్క్ శిక్షణ పొందుతున్న మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాస్ డైరెక్టర్ నాగరాజు మాట్లాడుతూ సంఘాల ద్వారా తీసుకున్న మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో రాస్ అధికారి రవి, ప్రకాష్, దివాకర్, జయంతి పాల్గొన్నారు.